ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనకాపల్లి
జిల్లా వార్తలు
సోమవారం 29 జూలై 2024



ఊపందుకున్న వ్యవసాయ పనులు

వరినాట్లు వేయడంలో రైతులు బిజీ

జిల్లాలోని పలు మండలాల్లో వరినాట్ల పనులు ఊపందుకున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు పంట పొలాల్లోకి సరిపడా నీరు చేరడంతో, ఇప్పటికే వరి ఆకు పెరిగి ఉన్న పలు గ్రామాల్లో ఆయా రైతులు చకచకా ట్రాక్టర్లతో పొలాల్లో దమ్ము పెట్టించి, తరువాత ఆ పొలాలకు చెందిన గట్లను అందంగా వేసుకొని అనంతరం వరినాట్లు వేసే పనుల్లో నిమగ్నమయ్యారు. ప్రస్తుతం ఎస్.రాయవరం మండలంలోని సర్వసిద్ధి, ఉప్పరాపల్లి, పెట్టుగోళ్ళపల్లి, పెదగుమ్ములూరు, చినగుమ్ములూరు తదితర గ్రామాల్లో రైతులు వరినాట్ల పనులు మొదలుపెట్టగా, మిగతా గ్రామాల్లో వరినాట్లకు ముందు చేయాల్సిన పనులపై ప్రత్యేక దృష్టి పెట్టారు. కాగా మండలంలో మొత్తం 3,281 ఎకరాల విస్తీర్ణంలో రైతులు వరిసాగు చేస్తున్నారు. - ఎస్.రాయవరం



ఎస్.రాయవరం మండలం ఉప్పరాపల్లి గ్రామంలో వరినాట్లు వేస్తున్న కూలీలు

శాకంబరి అలంకరణలో నూకాంబిక



శాకంబరి అలంకరణలో నూకాంబిక అమ్మవారు

అనకాపల్లి నూకాంబిక అమ్మవారు ఆదివారం శాకంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాఢ మాసం నాల్గవ ఆదివారం సందర్భంగా వివిధ రకాల కూరగాయలు, పండ్లతో అమ్మవారిని విశేషంగా అలంకరించారు. - వార్త 7వ పేజీలో..

భూ రికార్డులకు పటిష్ఠ భద్రత

రెవెన్యూ కార్యాలయాల్లో ఫైళ్లున్న గదుల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటు

- నిరంతర నిఘా కొనసాగించేందుకు ప్రత్యేకాధికారుల నియామకం
- భూముల రికార్డులు మరో సెట్ తయారీపై కసరత్తు

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని రెవెన్యూ శాఖలో కీలక భూ రికార్డుల భద్రతపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. ఇటీవల అన్నమయ్య జిల్లా మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయంలో భూములకు సంబంధించిన విలువైన ఫైళ్లు కాలిపోయిన నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తమైంది. మదనపల్లెలో ఉద్దేశపూర్వకంగానే కొందరు రెవెన్యూ రికార్డులు దహనం చేశారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని జిల్లాల్లో రెవెన్యూ శాఖలో కీలక భూ రికార్డుల భద్రతపై దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా రాష్ట్ర భూపరిపాలన, సర్వే రికార్డుల విభాగం ముఖ్య కమిషనర్ జి.జయలక్ష్మి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

ప్రభుత్వ ఆదేశాల మేరకు కలెక్టర్ విజయకృష్ణన్ జిల్లాలోని రెవెన్యూ కార్యాలయాల్లో భూ సంబంధిత రికార్డుల గదుల్లో భద్రత చర్యలు చేపట్టాలని జిల్లా రెవెన్యూ యంత్రాంగానికి మార్గదర్శకాలు విడుదల చేశారు. కలెక్టర్ కార్యాలయంలో సర్వే, భూపరిపాలన, ల్యాండ్ రికార్డుల విభాగాల్లో, మండల తహసీల్దారు కార్యాలయాల్లో రికార్డుల భద్రత విషయమై డివిజన్ స్థాయిలో ఆర్డీవోలు, మండల స్థాయిలో తహసీల్దార్లను ప్రత్యేకాధికారులుగా నియమించారు. జిల్లాలో అనకాపల్లి, నర్సీపట్నం రెవెన్యూ డివిజన్ కార్యాలయాల పరిధిలోని 24 మండల తహసీల్దారు కార్యాలయాల్లో రెవెన్యూ రికార్డుల గదుల్లో రికార్డుల భద్రతా చర్యలపై ముందుగా ఆర్డీవోలు తనిఖీలు నిర్వహించి, అవసరం మేరకు పటిష్ఠ నిఘా చర్యలు చేపడుతున్నారు.

భూ రికార్డులకు 24 గంటలూ భద్రత

భూ సంబంధిత రికార్డులు భద్రపరిచిన గది వద్ద 24 గంటలూ పర్యవేక్షణ ఉండేలా కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నారు. ప్రతి రోజు రికార్డు గది వద్ద వాచ్‌మన్, వీఆర్‌వో విధుల్లో ఉండేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. పరిసరాల్లో కదలాడే సిబ్బంది, ఇతరులపై నిఘా కొనసాగించేలా చర్యలు చేపడుతున్నారు. రాత్రి వేళ కూడా రికార్డులు భద్రపరిచిన గది వద్ద వాచ్‌మన్ ఉండాలని ... మిగతా 8వ పేజీలో



అనకాపల్లి తహసీల్దారు కార్యాలయంలో రికార్డుల గది ఫుటేజ్‌ని పరిశీలిస్తున్న దృశ్యం

నేడు స్పీకర్ అయ్యన్నపాత్రుడు రాక



విశాఖపట్నం, జూలై 28(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సోమవారం జిల్లాకు రానున్నారు. ఉదయం 9 గంటలకు గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరి పది గంటలకు విశాఖపట్నం ఎయిర్‌పోర్టుకు చేరుకుని సర్క్యూట్ హౌస్‌కు వెళతారు. మధ్యాహ్నం మూడు గంటల వరకు నగరంలో ఉండి నర్సీపట్నం వెళతారని అధికారులు తెలిపారు.

స్టాండింగ్ కమిటీ ఎన్నికకు నేడు కూటమి అభ్యర్థుల నామినేషన్

విశాఖపట్నం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి తరఫున పోటీ చేసే అభ్యర్థులు సోమవారం నామినేషన్ దాఖలు చేయాలని నిర్ణయించారు. స్టాండింగ్ కమిటీలోని పది స్థానాలకు పోటీ చేసేందుకు కూటమికి చెందిన కార్పొరేటర్లు పోటీ పడుతున్నారు. దీంతో ఎవరికి అవకాశం కల్పించాలనే దానిపై నేతల మధ్య కసరత్తు కొనసాగుతోంది. శని, ఆదివారాల్లో రెండుసార్లు దీనికోసం కూటమి ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు భేటీ అయి చర్చలు జరిపినప్పటికీ కొలిక్కిరాలేదు. దీంతో నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేలు ఇద్దరు చొప్పున ఎంపిక చేసి తుదిజాబితా తయారుచేయాలని తీర్మానించారు. సోమవారం ఉదయానికి అభ్యర్థుల ఎంపికపై ... మిగతా 8వ పేజీలో

మ్యాట్రిమోనీ మోసాలు



విశాఖలో పెరుగుతున్న బాధితులు

- వివాహ సంబంధ వెబ్‌సైట్లలో పేర్లు నమోదు చేసుకున్న వారే టార్గెట్
- ఆ డేటా ఆధారంగా మోసాలకు తెగబడుతున్న సైబర్ నేరగాళ్లు
- అందమైన యువతుల ఫొటోలతో ప్రొఫైల్స్
- ఫేక్ ఐడీలతో వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్‌లో చాటింగ్
- వివిధ రకాలుగా లోబరచుకుని డబ్బు గుంజుతున్న వైనం
- బాధితుల్లో ఇంజనీర్లు, వైద్యులు, ఇతర ఉద్యోగులు
- విశాఖలో వరుస కేసులతో అప్రమత్తమైన పోలీసులు

(విశాఖపట్నం- ఆంధ్రజ్యోతి)

విశాఖలో ఇటీవల మ్యాట్రిమోనీ మోసాలు పెరుగుతున్నాయి. పెళ్లి సంబంధం కోసం వివిధ వెబ్‌సైట్లలో పేర్లు నమోదుచేసుకున్న వారి వివరాలను సేకరిస్తున్న సైబర్ నేరగాళ్ల మోసాలకు తెగబడుతున్నారు. మంచి ఉద్యోగం చేస్తూ 30 ఏళ్లు దాటినా పెళ్లికానివారిని, రెండో పెళ్లి సంబంధం కోసం పేరు రిజిస్ట్రేషన్ చేసుకున్న వారిని టార్గెట్ చేస్తున్నారు. ముగ్గురు, నలుగురు ముఠాగా ఏర్పడి, యువతులతో ఫోన్ చేసి మాట్లాడిస్తున్నారు. వెబ్‌సైట్‌లో వివరాలను చూశామని, పెళ్లికి ఆసక్తిని కనబరుస్తున్నారు. ఫోన్ నంబర్‌కు అందమైన యువతి ఫొటోను డీపీగా పెట్టి ఆకర్షిస్తున్నారు. ఆ తరువాత వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్‌లో చాటింగ్‌లు, ఫొటోలు, వీడియోలను పంపించి నియంత్రణలోకి తెచ్చుకుంటున్నారు. పుట్టినరోజు, ఇతర అవసరాల పేరుతో డబ్బు గుంజుతున్నారు. ఒకసారి కలుద్దామంటూ ప్రతిపాదించి, అత్యవసర పనిపడిందని, కుటుంబ సభ్యులు ప్రమాదానికి గురయ్యారని సాకులు చెబుతున్నారు. అనుమానం రాకుండా వారిని ఉద్రేకపరిచేలా ... మిగతా 8వ పేజీలో

అవగాహన తప్పనిసరి



సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఇటీవల మ్యాట్రిమోనీ మోసాలు పెరుగుతున్నాయి. బాధితులంతా విద్యావంతులు, ఉద్యోగాల్లో ఉన్నవారే. పెళ్లి సంబంధం, అందులోనూ అమెరికా సంబంధం అనేసరికి మరో ఆలోచన లేకుండా ట్రాన్స్‌లోకి వెళ్లిపోతున్నారు. వారు చెప్పింది గుడ్డిగా నమ్మేస్తున్నారు. మ్యాట్రిమోనీ ఫ్రాడ్స్, స్టాక్‌మార్కెట్ ఫ్రాడ్స్, టాస్క్‌గేమ్స్ పేరుతో ఎవరైనా ఫోన్‌చేసినా స్పందించకూడదు. అనుమానం ఉంటే 9490617917 నంబరుకు సమాచారం ఇవ్వాలి. మోసానికి గురైనట్టు గుర్తిస్తే 1930 నంబరుకు ఫోన్‌చేయాలి. దీంతో డబ్బులు సైబర్ నేరగాళ్ల చేతిలో పడకుండా ఫ్రీజ్ చేయించే వీలుంటుంది.

- కె.భవానీప్రసాద్, సైబర్‌క్రైమ్ సీఐ

కలుషిత జల్ ఇంకెన్నాళ్లు?

జల్‌జీవన్ మిషన్ పనుల్లో డొల్లతనం

- రూ.13 కోట్లు వెచ్చించి పథకం నిర్మించినా చోడవరంలో తప్పని తాగునీటి సమస్య
- గత ప్రభుత్వంలో మంత్రి బంధువుకు కాంట్రాక్ట్
- ఇష్టారాజ్యంగా పనులు
- పనులు పూర్తయినట్టు చూపించి ఎన్నికల ముందు హడావిడిగా ప్రారంభం
- తరచూ మోటార్లకు మరమ్మతులు, పైపులైన్ల లీకేజీలు
- పట్టణ వాసులకు తప్పని అవస్థలు



జన్నవరం వద్ద పెద్దేరు నదిలో నిర్మించిన తాగునీటి పథకం బావి

చోడవరం, జూలై 28:

జల్‌జీవన్ మిషన్ పథకం కింద పట్టణంలో రూ.13 కోట్లతో నిర్మించిన భారీ తాగునీటి పథకం ప్రారంభంలోనే స్థానికులకు చుక్కలు చూపిస్తున్నది. ఇంటింటికీ కొళాయిల ద్వారా తాగునీరు అందించేందుకు ఉద్దేశించిన ఈ పథకం నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోలేకపోతోంది. దీని ద్వారా తాగునీరు అంతంత మాత్రంగానే అందుతుండగా, ఇక ఈ పథకం మోటార్లు, పైపులైన్లు తరచూ మరమ్మతులకు గురవుతుండడం, సరఫరా అవుతున్న నీరు కూడా తరచూ కలుషితంగా వస్తుండడంతో ఈ పథకం పనుల్లో డొల్లతనం బయటపడిందని స్థానికులు విమర్శిస్తున్నారు.



పట్టణంలోని లక్ష్మీపురం రోడ్డులో పైపులైను లీకేజీని అరికట్టడానికి తవ్విన దృశ్యం

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నాలుగేళ్ల పాటు నత్తనడకన సాగుతూ వచ్చిన ఈ తాగునీటి పథకం పనులు పూర్తయినట్టు చూపించి ఎన్నికల ముందు హడావిడిగా తాగునీటి సరఫరా ప్రారంభించారు. ఈ పథకం ప్రారంభమైన తరువాత పట్టణంలో వేసిన పైపులైన్లు తరచూ లీకై పోతుండడం, తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడడంతో పాటు బురద నీరు సరఫరా అవుతుండడంతో పంచాయతీ అధికారులు తల పట్టుకుంటున్నారు.

పనుల్లో డొల్లతనం

మండలంలోని జన్నవరం వద్ద పెద్దేరు నదిలో ఈ పథకం కోసం నిర్మించిన భారీ పంపుహౌస్‌లో నీటిని లిఫ్ట్ చేసే మూడు మోటార్లు కూడా తరచూ మరమ్మతులకు గురవుతుండడం, నీటిని సరిగా పంపింగ్ చేయకపోవడం ఈ పనుల నాణ్యతకు అద్దం పడుతోంది. అప్పట్లో పొరుగు జిల్లాకు చెందిన మంత్రి బంధువు ఈ కాంట్రాక్టు పనులు చేపట్టడం, అధికారంలో ఉన్నది ఆ పార్టీయే కావడంతో అధికారులు కూడా వారికి గట్టిగా ఎదురుచెప్పలేని పరిస్థితి నెలకొంది. పైపలైను పనులను ... మిగతా 8వ పేజీలో

రావణాపల్లి పంట కాలువలు అస్తవ్యస్తం



పిచ్చి మొక్కలు, వ్యర్థాలతో పూడుకుపోయిన కాలువ

పూడిక పేరుకుపోయి పొలాలకు అందని సాగునీరు

- రెండేళ్ల క్రితం రూ.2.5 కోట్లతో ప్రతిపాదనలు
- నిధులు విడుదల చేయని గత వైసీపీ ప్రభుత్వం
- ఇబ్బంది పడుతున్న ఆయకట్టు రైతులు

నర్సీపట్నం, జూలై 28:

రావణాపల్లి పంట కాలువల్లో పూడిక పేరుకుపోయి ఆయకట్టుకి పూర్తిస్థాయిలో సాగునీరు అందడం గగనమవుతోంది. కాలువల్లో ముళ్ల పొదలు, పిచ్చి మొక్కలు పెరిగిపోయి అధ్వానంగా తయారయ్యాయి.

నర్సీపట్నం, గొలుగొండ మండలాల్లోని 2,668 ఎకరాల ఆయకట్టుకి రావణాపల్లి రిజర్వాయర్ ద్వారా సాగునీరు అందుతోంది. కాలువల్లో పూడిక పేరుకుపోయి, పిచ్చి మొక్కలు అడ్డుపడి పొలాలకు సాగునీరు అందడం లేదు. కాలువల లైనింగ్, మదుములు, షట్టర్లు, గేట్లు మరమ్మతులకు గురయ్యాయి. పంట కాలువల్లో పూడిక తొలగించమని గత ఏడాది పలువురు ఆయకట్టు రైతులు దర్నా కూడా చేశారు. గత ఐదేళ్ల కాలంలో వైసీపీ ప్రభుత్వం ఇరిగేషన్ శాఖను పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. సాగునీరు అందించే పంట కాలువల నిర్వహణ అధ్వానంగా తయారు చేసింది. మరమ్మతులకు గురైన మదుముల గేట్లు, షట్టర్లు బాగు చేయకుండా వదిలేసింది. రెండేళ్ల క్రితం ... మిగతా 8వ పేజీలో



రావణాపల్లి రిజర్వాయర్

రక్షిత ప్రదేశంలో రక్షణ కరువు!


రాజానగరంలో భవనం పరిస్థితి

భయపెడుతున్న తుఫాన్ రక్షిత భవనాలు

- వెంకటనగరం, రాజానగరంలలో దశాబ్దాల కిందట నిర్మాణం
- నేడు శిథిల స్థితికి చేరిక
- పాఠశాలలను ఆనుకుని ఉండడంతో గ్రామస్థులు భయాందోళన
- జరగరానిది జరగక ముందే అధికారులు స్పందించాలని వేడుకోలు


పెచ్చులూడి పడుతున్న శ్లాబ్

పాయకరావుపేట రూరల్, జూలై 28: ప్రకృతి వైపరీత్యాల సమయాల్లో తీర ప్రాంత గ్రామాల్లోని ప్రజలను సురక్షిత భవనాలలోకి తరలించేందుకు నిర్మించిన తుఫాన్ రక్షిత భవనాలు పలు చోట్ల నేడు శిథిలావస్థకు చేరుకున్నాయి. వీటిని నిర్వహణను పట్టించుకునే వారు లేకపోవడంతో కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. మండలంలోని వెంకటనగరం పంచాయతీ పరిధిలో వెంకటనగరం, రాజానగరం గ్రామాల్లో దశాబ్దాల కిందట నిర్మించిన ఈ భవనాలు నేడు ప్రమాదకరంగా మారాయి. పూర్తిగా శిథిలస్థితికి చేరుకున్నాయి. ఈ రెండు భవనాలు పాఠశాలల ఆవరణలో ఉండడంతో ఎప్పుడు కూలుతాయో, ఏ ప్రమాదం జరుగుతుందోనని ఇటు విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో పాటు అటు ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. తుఫాన్‌ల సమయాల్లో ప్రజలకు పునరావాసం కల్పించి వారికి ఆహారం అందజేసేందుకు గ్రామంలోని పాఠశాలలను ఉపయోగించుకుంటున్నారు. అయితే వెంకటనగరంలోని పాఠశాలలో వర్షం ఎక్కువగా కురిస్తే నీరు చేరి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో తుఫాన్ సమయంలో ప్రజలకు భోజనాలు వండడానికి నానా అవస్థలు పడుతున్నారు. ఎంపీపీ పాఠశాల ఆవరణలో ఉన్న తుఫాన్ రక్షిత భవనం పునాదులు, పిల్లర్లు పెచ్చులూడి కూలడానికి సిద్ధంగా ఉంది. గజపతినగరం, పాల్మన్‌పేట, పెంటకోట, రత్నయ్యమ్మపేట తదితర గ్రామాల్లో నూతనంగా తుఫాన్ రక్షిత భవనాలను నిర్మించినా, వెంకటనగరంలో మాత్రం కొత్త భవనాన్ని నిర్మించలేదు. శిథిలస్థితిలో ఉన్న ఈ భవనాన్ని తొలగించి కొత్త భవనాన్ని నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినప్పటికీ పట్టించుకునేవారు కరువయ్యారని వాపోతున్నారు. ఇదిలావుంటే, ఈ తుఫాన్ రక్షిత భవనాన్ని గతంలో గ్రామంలో బహుళ ప్రయోజనాలకు ఉపయోగించేవారు. ఇందులోనే పంచాయతీ కార్యాలయం, రేషన్ డిపో, అంగన్‌వాడీ కేంద్రాన్ని నిర్వహించేవారు. ప్రస్తుతం భవనం శిథిలస్థితికి చేరుకుని కూలేందుకు సిద్ధంగా ఉందని గ్రామస్థులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాల్సిందిగా అంతా కోరుతున్నారు.


భవనం మెట్ల వద్ద దుస్థితి


వెంకటనగరంలో పాఠశాల ఆవరణలో శిథిల స్థితికి చేరుకున్న రక్షిత భవనం

క్రైం... crime news

బైక్ పైనుంచి జారిపడి మహిళ మృతి

కోటవురట్ల, జూలై 28 : బైక్ పైనుంచి జారిపడి ఓ మహిళ మృతిచెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి ఎస్ఐ రమణయ్య తెలిపిన వివరాలివి. కొడవటిపూడి గ్రామానికి చెందిన తేటకాల రత్నం (36) కె.వెంకటాపురంలో గల జీడీపిక్కల ఫ్యాక్టరీలో పనిచేస్తూ ఇద్దరు పిల్లలను, భర్తను పోషించేది. మూడు నెలలు నుంచి ఫ్యాక్టరీ మూతపడింది. దీంతో ఆమె ఆదివారం తొమ్మిది గంటలకు కొడవటిపూడి గ్రామం నుంచి ఫ్యాక్టరీకి పీఎఫ్ పనిపై బయల్దేరింది.అటుగా వస్తున్న అపరిచిత వ్యక్తి బైక్ ఆపి దానిపై వస్తుంది. ఇంతలో ఒక్కసారిగా జారిపడి ఆమె మృతి చెందింది. అయితే ఈ ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. సమాచారం అందుకున్న పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోటవురట్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇంతకీ ఈమె ఎవరి బైక్ ఎక్కింది, ప్రమాదం ఎలా జరిగిందని పోలీసులు ఆరా తీస్తున్నారు.

అదృశ్యమైన యువకుడు మృతి

కొయ్యూరు, జూలై 28: మండలంలోని శరభన్నపాలెం గ్రామానికి చెందిన రీముల జయవర్ధన్ అలియాస్ బాబి (22) మృతి చెందాడు. ఈ నెల 21వ తేదీన అదృశ్యమైన బాబి కత్తిరాలలొద్ది సమీప కొండవాగు ప్రవాహంలో గల్లంతైనట్టు భావించి శనివారం రాష్ట్ర విపత్తుల నిరోధక బృందాలు గాలింపు చర్యలు చేపట్టారు. ఆదివారం మధ్యాహ్నం పి.మాకవరం గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల వెనుక నుంచి ప్రవహిస్తున్న కొండవాగులో ఒక చెట్టు మొదలు వద్ద ఇసుకలో జయవర్ధన్ మృతదేహం లభ్యమైంది. కొయ్యూరు సీఐ వెంకటరమణ, ఎస్ఐ రామకృష్ణతో పాటు రెవెన్యూ సచివాలయ సిబ్బంది, కుటుంబీకులు గాలింపు చర్యలులు చేపట్టినా బాబి ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో ఆదివారం ఉదయం నుంచి ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు మరోదఫా పి.మాకవరం-నడింపాలెం మధ్య కొండవాగు ప్రవాహం లలో గాలించగా జయవర్ధన్ మృతదేహం లభ్యమైంది. కొయ్యూరు ఎస్ఐ రామకృష్ణ కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సీపట్నం తరలించారు. అంది వచ్చిన ఒక్కగానొక్క కొడుకు అదృశ్యమైన వారం రోజుల అనంతరం మృతి చెంది కనిపించడంతో తల్లిండ్రులు శోక సంద్రంలో మునిగిపోయారు.

అధికారుల నిర్లక్ష్యంతో మునిసిపాలిటీ ఆదాయానికి గండి

- పట్టణంలోని షాపింగ్ కాంప్లెక్స్‌ల్లో ఖాళీగా ఉన్న దుకాణాలు
- ఏళ్ల తరబడి కోల్పోతున్న ఆదాయం
- పట్టించుకోని అధికారులు, పాలకులు


ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో నిర్మించిన మునిసిపల్ దుకాణ సముదాయంలో కొన్నేళ్లుగా ఖాళీగా ఉన్న కొన్ని దుకాణాలు

ఎలమంచిలి, జూలై 28: అధికారుల నిర్లక్ష్యంతో మునిసి పాలిటీ ఆదాయానికి గండి పడుతోంది. పట్టణంలోని మునిసిపల్ దుకాణ సముదాయాల్లో కొన్ని దుకాణాలు ఏళ్ల తరబడి ఖాళీగా ఉండడంతో మునిసి పాలిటీ ఆదాయాన్ని కోల్పోతోంది. అయినా పాలకులు పట్టించు కోవడం లేదు. వివరాల్లోకి వెళితే.. మునిసిపాలిటీ దుకాణ సముదాయాల్లో కొన్ని దుకాణాలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. వీటికి నిర్వహణ లేకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. ఫలితంగా వేలాది రూపాయలు మునిసిపల్ ఆదాయానికి గండి పడుతోంది. దుకాణాలు నిరుపయోగంగా ఉంటున్నా.. అధికారులు గానీ, పాలకులు గానీ దృష్టి సారించడం లేదు. మునిసిపల్ కార్యాలయానికి చెంతనే పంచాయతీగా ఉన్న సమయంలో పీవీ కాంప్లెక్సు పేరిట దుకాణ సముదాయాన్ని నిర్మించారు. ఈ దుకాణ సముదాయంలో గ్రౌండ్ ఫ్లోర్‌లోని 14 దుకాణాల నుంచి అద్దె వస్తున్నది. రెండో అంతస్తు సగ భాగంలో గ్రామ సచివాలయ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. మరి కొంతభాగంలో ఉన్న దుకాణాలు ఖాళీగా ఉన్నాయి. ఏళ్ల తరబడి ఖాళీగా ఉండడంతో మునిసిపల్ ఆదాయానికి గండి పడుతోంది. ఈ సముదాయంపై పాలకులు, అధికారులు దృష్టి సారించకపోవడంపై పలు విమర్శలు వస్తున్నాయి. అదేవిధంగా బస్టాండ్ సమీపంలో మునిసిపల్ దుకాణ సముదాయాన్ని నిర్మించారు. వీటిలో గ్రౌండ్ ఫ్లోర్‌లోని దుకాణాలు అద్దెకు ఇచ్చినా.. పైఅంతస్తులో కొన్ని దుకాణాలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. వీటిలో కొన్ని దుకాణాల్లో మునిసిపల్ వస్తు సామగ్రిని భద్రపరిచారు. మిగిలిన దుకాణాలను చిరువ్యాపారులకు కేటాయించాలని పలువురు సూచిస్తున్నారు. మునిసిపల్ ఆదాయ వనరులను పెంచే దిశగా పాలకులు, అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తే మునిసిపాలిటీ ఆదాయం పెరుగుతుందని పలువురు కోరుతున్నారు.

పాల్తేరుకు 'పుష్కర' నీరు అందించాలి

- 'యనమల'కు టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి విజ్ఞప్తి


యనమల రామకృష్ణుడుకి వినతి పత్రం అందిస్తున్న నాయకులు

పాయకరావుపేట, జూలై 28: మండలంలోని పాల్తేరు గ్రామంలో గల వ్యవసాయ భూములకు ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో పుష్కర ఎత్తిపోతల కాల్వ నీరు అందించి ఆదుకోవాలని టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు తదితరులు శాసన మండలి ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడికు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం చిట్టిబాబు ఆధ్వర్యంలో పాల్తేరు పంచాయతీ పాలకవర్గంతో పాటు పలువురు రైతులు తుని పట్టణంలో యనమల రామకృష్ణుడిని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా చిట్టిబాబు మాట్లాడుతూ పాల్తేరు పక్కనే ఉన్న వల్లూరు గ్రామం వరకు పుష్కర ఎత్తిపోతల కాల్వ ద్వారా వస్తున్న గోదావరి నీటిని పాయకరావుపేట మండలంలోని పాల్తేరు చెరువులకు అనుసంధానం చేస్తే పాల్తేరు రెవెన్యూ పరిధిలోని వెయ్యి ఎకరాలకు పూర్తిస్థాయిలో సాగు నీరు అందుతుందన్నారు. ఎస్.నర్సాపురం, శ్రీరాంపురం, కుమారపురం తదిత గ్రామాల్లో వందలాది ఎకరాల్లో పంటలు పుష్కలంగా పండే అవకాశం ఉందని వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు దేవవరపు రాజబాబుతో పాటు పాల్తేరు సర్పంచ్ గోసల కృష్ణ, బుద్దాల శ్రీను, వెంకటసూరి తదితరులు పాల్గొన్నారు.

కిరండోల్ రైలు దంతెవాడ వరకే..

విశాఖపట్నం, జూలై 28: భద్రతా కారణాల దృష్ట్యా విశాఖ, కిరండోల్ మధ్య నడిచే ప్రత్యేక పాసింజర్ రైళ్ల గమ్యాలను కుదించినట్టు సీనియర్ డీసీఎం కే సందీప్ తెలిపారు. దీంతో 08551 నంబరు గల విశాఖ-కిరండోల్ రైలు ఈనెల 28 నుంచి 31వ తేదీ వరకు విశాఖ నుంచి దంతెవాడ వరకు, తిరుగు ప్రయాణంలోని 08552 నంబరు గల కిరండోల్ - విశాఖ రైలు ఈనెల 29 నుంచి ఆగస్టు ఒకటి వరకు దంతెవాడ నుంచి విశాఖకు నడుస్తుందని పేర్కొన్నారు. దంతెవాడ, కిరండోల్ మధ్య రాకపోకలను తాత్కాలికంగా రద్దు చేసినట్టు పేర్కొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	85.00
లైవ్ ధర	105.00
విత్ స్కిన్	180.00
స్కిన్ లెస్	190.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	485
విజయనగరం	489
శ్రీకాకుళం	489

తల్లడిల్లుతున్న తల్లీబిడ్డ పైలట్లు

మూడు నెలలుగా అందని వేతనాలు

- ఇచ్చేదే అరకొర.. అదీ సక్రమంగా అందని పరిస్థితి
- డేటా ఎంట్రీ విధులు అదనం
- నెట్ డేటా కోసం జేబుకు చిల్లు


తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లో బాలింతను తరలిస్తున్న దృశ్యం

నర్సీపట్నం, జూలై 28:

ఇచ్చేవే అరకొర వేతనాలు.. అవి కూడా సక్రమంగా ఇవ్వడం లేదు.. దీంతో తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సిబ్బంది తల్లడిల్లిపోతున్నారు. ఆర్థిక ఇబ్బందులు వేధిస్తుండడంతో తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు.

అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు 2015, డిసెంబరు 31న తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లను రాష్ట్రంలో ప్రవేశ పెట్టారు. గర్భిణులను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, ప్రసవం తర్వాత తల్లిని, బిడ్డను క్షేమంగా ఇంటికి చేర్చడానికి ప్రత్యేకంగా తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారు. జిల్లాలో 30కి పైగా తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు ఉన్నాయి. డ్రైవింగ్ లైసెన్స్, పదో తరగతి అర్హత ఉన్న వారిని ప్రతి వాహనానికి ఒక పైలట్ (డ్రైవరు)ను నియమించారు. 108, 104 సర్వీసులను నిర్వహిస్తున్న అరబిందో కంపెనీయే ఈ తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలను కూడా నిర్వహిస్తోంది. పైలట్ జీతం రూ.8,800లు కాగా కటింగ్‌లు రూ.930లు పోను రూ.7,870లు చేతికి ఇస్తున్నారు. అయితే గత మూడు నెలలుగా జీతాలు అందక దుర్భర జీవితం అనుభవిస్తున్నామని తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుటుంబాలను పోషించుకోవడానికి ప్రతి నెలా అప్పులు చేసి వడ్డీలు కట్టలేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు. యాజమాన్యం కట్టాల్సిన పీఎఫ్ వాటాని కూడా సిబ్బంది జీతం నుంచి జమ చేసుకుంటున్నారని సిబ్బంది అంటున్నారు. కార్మిక చట్టం ప్రకారం యాజమాన్యం వాటా 50 శాతం, ఉద్యోగి జీతం నుంచి 50 శాతం కలిపి ప్రావిడెంట్ ఫండ్ ఖాతాకి జమ చేయాలి. తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ పైలట్ల విషయంలో యాజమాన్యం వాటా కూడా సిబ్బంది జీతం నుంచి జమ చేసుకుంటున్నారు. ఆన్‌లైన్‌లో డేటా ఎంట్రీ నమోదు చేయడానికి సెల్‌ఫోన్లు ఇవ్వకుండా కేవలం సిమ్‌కార్డులు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకున్నారు. అయితే ఇంటర్‌నెట్ వాడకానికి కంపెనీ ఇచ్చిన సిమ్ కార్డులు పని చేయడం లేదని, ఇందుకోసం ప్రతి నెలా రీచార్జ్ చేసుకోవాల్సి వస్తోందని సిబ్బంది వాపోతున్నారు. నెట్ సౌకర్యం ఉంటే గాని డేటా ఆన్‌లైన్ చేయడం వీలుపడదని అంటున్నారు. పైలట్ ఉద్యోగంతో పాటు డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉద్యోగం కూడా చేయాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు. అరకొర జీతం నుంచి నెట్ బ్యాలెన్స్ రీచార్జ్ చేసుకొని బాలింతలు, గర్భిణుల వివరాలు ఆన్‌లైన్ చేస్తున్నామని అంటున్నారు. మూడు నెలల జీతాలు బకాయిలు తక్షణమే విడుదల చేసి, ప్రతీ నెలా ఒకటో తేదీన జీతాలు ఇచ్చే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని యూనియన్ నాయకులు కోరుతున్నారు.

దేవదాయ భూముల ఆక్రమణకు యత్నించిన వారిపై చర్యలు తీసుకోవాలి

- సీపీఎం నాయకులు డిమాండ్


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీరామ్

అనకాపల్లి టౌన్, జూలై 28: పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వెళ్లే మార్గంలో ఉన్న దేవదాయశాఖ భూములను ఆక్రమించేందుకు ప్రయత్నించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి గంటా శ్రీరామ్, జిల్లా కమిటీ సభ్యుడు ఆర్.శంకరరావు, వీవీ శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఆదివారం ఇక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కాంప్లెక్స్‌కు వెళ్లే మార్గంలో సీతారామచంద్రస్వామి (అంబికాబాగ్) భూములు ఉన్నాయన్నారు. దేవదాయశాఖ ఆధీనంలో ఉన్న ఈ భూములను కొంతమంది ఆక్రమించడానికి ప్రయత్నించినట్టు ఆరోపించారు. భూముల పరిరక్షణకు చుట్టూ కంచె వేసి, సెక్యూరిటీని కూడా దేవదాయశాఖ ఏర్పాటు చేసిందన్నారు. అయినప్పటికీ పట్టపగలు శనివారం కొంతమంది ప్రైవేటు వ్యక్తులు వచ్చి సదరు కంచెను తొలగించి, చదును చేయడం తగదన్నారు. దీనిపై సోమవారం కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టనున్నట్టు చెప్పారు. భూములు కబ్జా చేసేందుకు ప్రయత్నించే వారి పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పెద్దేరు రాచకట్టు కాలువకు నీరు విడుదల

మాడుగుల రూరల్, జూలై 28: మండలంలోని రావిపాలెం పెద్దేరు జలాశయం రాచకట్టు కాలువ నీటిని ఆదివారం ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి విడిచిపెట్టారు. ఏటా ఖరీఫ్ సీజన్‌లో మాడుగుల మండలం రాచకట్టు కాలువ ఆయకట్టు రైతులు సాగు చేసే పంటలకు జలాశయం నీటిని విడిచిపెడుతుంటారు. ఈ క్రమంలో ఆదివారం జలాశయం వద్ద కొబ్బరికాయ కొట్టి పూజ చేసి గేటు ఎత్తి నీటిని ఎమ్మెల్యే బండారు విడిచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాగునీటి సమస్యలు పరిష్కరించే దిశగా కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. పెద్దేరు జలాశయంలో పుష్కలంగా నీరు ఉందని, వర్షాలు పడటంతో గరిష్ఠ స్థాయికి చేరువైందని చెప్పారు. అనంతరం ఆయన మాడుగుల మోదకొండమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు ఆయనను సాదరంగా ఆహ్వానించారు. కేజేపురం మోదకొండమ్మ జాతర వాల్‌పోస్టర్‌ను బండారు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ సీఎం రమేశ్ సోదరుడు సురేశ్ నాయుడు, టీడీపీ జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్యబాబు, గవిరెడ్డి రామానాయుడు, పీవీజీ కుమార్, పుప్పాల అప్పలరాజు, అద్దిపల్లి జగ్గారావు, ఉండూరు దేముడు, ఇన్‌చార్జి ఎంపీపీ రాజారామ్, పుప్పాల రమేశ్ తదితర కూటమి నాయకులు, జలాశయం అధికారులు పాల్గొన్నారు.


పెద్దేరు జలాశయం నుంచి నీటిని విడిచిపెడుతున్న ఎమ్మెల్యే బండారు

విద్యుత్ సిబ్బందికి రైతుల ప్రశంసలు

ప్రతికూల పరిస్థితుల్లోనూ విద్యుత్ పునరుద్ధరణ


లైన్‌మెన్ సాయిని వీపుపై మోసుకొని స్తంభం వద్దకు తీసుకెళుతున్న సహాయకుడు కొండబాబు

బుచ్చెయ్యపేట, జూలై 28: ప్రతికూల పరిస్థితుల్లో సైతం విద్యుత్ పునరుద్ధరణకు కృషి చేసిన లైన్‌మన్, అతడి సహాయకుడిని రైతులు అభినందిస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి. వర్షాలకు వడ్డాదిలో కోవెల అయ్యన్న రఘుకి చెందిన మోటారుకు సరఫరా అవుతున్న మెయిన్ విద్యుత్ వైర్లు కిందకు పడిపోయాయి. దీంతో 20 ఎకరాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీనిపై ఫిర్యాదు అందుకున్న లైన్‌మన్ సాయి, సహాయకుడు కొండబాబు ఆదివారం పొలం వద్దకు చేరుకున్నారు. పొలంలో నిండా నీరు ఉంది. వైర్లు వర్షం నీటిలో పడిపోయి ఉండడం గమనించారు. నీటిలో కాళ్లు తడిస్తే విద్యుత్ స్తంభంపైకి ఎక్కడానికి ఇబ్బందిగా అవుతుందని గుర్తించారు. దీంతో సాయిని కాళ్లు తడవకుండా సహాయకుడు కొండబాబు తన వీపుపై ఎక్కించుకొని పొలంలో నడుస్తూ విద్యుత్ స్తంభం వద్దకు తీసుకెళ్లారు. కొండబాబు వీపుపై నుంచి సాయి స్తంభం ఎక్కాడు. అనంతరం కొండబాబు పొలంలో పడిపోయిన విద్యుత్ తీగలు తాడు సహాయంతో లైన్‌మన్‌కు అందించాడు. దీంతో మెయిన్‌లైన్ వైర్లను బిగించి, నిలిచిపోయిన విద్యుత్ సరఫరాను పునరుద్దరణ చేపట్టారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ విషయంలో లైన్‌మెన్ సాయి, సహాయకుడు చూపిన చొరవకు అభినందనలు కురిపించారు.

శాకంబరి అలంకరణలో నూకాంబిక అమ్మవారు

- భక్తులతో కిటకిటలాడిన ఆలయం


ఆలయంలో క్యూలైన్‌లో ఉన్న భక్తులు (అంతర్ చిత్రం) అమ్మవారు

అనకాపల్లి టౌన్, జూలై 28 : ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత అనకాపల్లి నూకాంబిక అమ్మవారు ఆదివారం శాకంబరీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాఢమాసం సందర్భంగా వివిధ రకాల కూరగాయలు, పండ్లతో అమ్మవారిని అర్చకులు సర్వాంగ సుందరంగా అలంకరించారు. సెలవు దినం కావడంతో అమ్మ దర్శనానికి అనకాపల్లితో పాటు వివిధ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేయడంతో కోలాహల వాతావరణం నెలకొంది. పలువురు కుటుంబాలతో సహా వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. మరికొందరు అమ్మవారి పండగను చేసుకుని ఘటాలను ఆలయానికి తీసుకు వచ్చి సమర్పించారు. ప్రముఖ వ్యాపారవేత్త మళ్ల జగ్గఅప్పారావు కూరగాయలను సమకూర్చారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు తలెత్తకుండా ఆలయ ఈవో బండారు ప్రసాద్ ఆధ్వర్యంలో సిబ్బంది చర్యలు చేపట్టారు.

తాండవలో పెరుగుతున్న నీటి నిల్వలు

- ఆయకట్టు రైతుల ఆనందం


తాండవలో 372 అడుగులకు చేరుకున్న నీటి నిల్వలు

నాతవరం,జూలై 28: తాండవ రిజర్వాయర్‌లో రోజురోజుకూ నీటినిల్వలు పెరుగుతుండటంతో ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తాండవ గరిష్ఠ నీటిమట్టం 380 అడుగులు కాగా, ప్రస్తుతం 372 అడుగులకు నీటినిల్వలు చేరుకున్నాయి. ఇన్‌ఫ్లో ద్వారా తాండవ ఎగువ ప్రాంతాల నుంచి 500 క్యూసెక్కుల నీరు వస్తోందని తాండవ డీఈ అనురాధ తెలిపారు. గత ఏడాది తాండవలో జూలై 28 నాటికి 369 అడుగుల నీటినిల్వలు ఉన్నాయని తెలిపారు. ఈ పదిరోజుల్లో నీటి నిల్వలు బాగా పెరిగాయని డీఈ తెలిపారు. ఇదే విధంగా వర్షాలు పడితే ఆగస్టు 15న నీరు విడుదల చేసేలోపు తాండవలో మరింత నీటినిల్వలు పెరిగే అవకాశం ఉందని డీఈ అనురాధ పేర్కొన్నారు.

కోనాం జలాశయంలో వృథాగా పోతున్న నీరు

- రైతులు ఆవేదన


మెయిన్‌గేట్ల ద్వారా వృథాగా పోతున్న సాగునీరు

చీడికాడ, జూలై 28: మండలంలో కోనాంలో ఉన్న జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న సాగునీరు తక్కువగా ఉండగా, జలాశయం మెయిన్‌గేట్లు, దిగువ కాలువ ద్వారా ఎక్కువ సాగు నీరు వృథాగా పోతుండటంతో ఎగువ కాలువ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జలాశయం గరిష్ఠ స్థాయి నీటిమట్టం 101.25 మీటర్లు కాగా, ఆదివారం ఉదయానికి 99.40 మీటర్లకు చేరుకుంది. ఇన్‌ఫ్లో 30 క్యూసెక్కులు కాగా.., ఎగువ, దిగువ గేట్లు ద్వారా 150 క్యూసెక్కులకు పైగా సాగునీరు వృథాగా పోతోంది. ఈ దుస్థితి గత 20 రోజులుగా ఏర్పడిందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రావణాపల్లి పంట కాలువలు అస్తవ్యస్తం

... 5వ పేజీ తరువాయి



మరమ్మతులకు గురైన మదుం

పంట కాలువల లైనింగ్, పూడిక తీత, మదుములు, గేట్లు, షట్టర్ల మర్మతులకు రూ.2.5 కోట్లతో ఇరిగేషన్ అధికారులు ప్రతిపాదనలు పంపితే బుట్టదాఖలు చేసింది. రిజర్వాయర్ నిండా నీరు ఉన్నా ప్రయోజనం ఉండడం లేదని, పంటకు అవసరం వచ్చినప్పుడు సాగు నీరు అందడం లేదని రైతులు వాపోతున్నారు. రిజర్వాయర్ గేట్లు ఎత్తి నీరు విడుదల చేసినా ఆయకట్టుకు సాగునీరు అందే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉపాధి హామీ పథకంలో కాలువలో పూడికతీత పనులు చేపట్టాలని కోరుతున్నారు.

కలుషిత జల్ ఇంకెన్నాళ్లు?

... 5వ పేజీ తరువాయి

కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా చేపట్టడంతో సమస్యలు ఎదురవుతున్నాయి. జన్నవరం వద్ద పెద్దేరు నది నుంచి నీటిని పైపుల ద్వారా చోడవరం పట్టణంలోని ట్యాంకులకు సరఫరా చేసి ప్రజలకు ఇంటింటికీ తాగునీరు అందించాలన్నది జల్‌జీవన్ మిషన్ ప్రాజెక్టు ఉద్దేశం. ఈ మేరకు పట్టణంలోని అనేక వీధుల్లోని రోడ్లను తవ్వి మరీ పైపులైన్లు ఏర్పాటు చేయడంతో పాటు ఆరు వేల నివాసాలకు కొళాయి కనెక్షన్లు కూడా ఇచ్చారు. అయినా ఇంటింటికీ వేసిన కొళాయిల ద్వారా నీరు సరిగా రావడం లేదు సరికదా, కొళాయిల నుంచి తరచూ బురదనీరు సరఫరా అవుతోంది. ఇంటింటికీ కొళాయి పేరుతో ఇప్పటికే వీధుల్లో రోడ్లను తవ్వి మరీ పైపులైన్లు వేశారు. తీరా మళ్లీ ఇప్పుడు లీకులంటూ మళ్లీ గోతులు తవ్వుతుండడం, తిరిగి లీకులు సరిచేసి గోతులు కప్పుతుండడంతో రహదారులు అధ్వానంగా తయారై వాహనచోదకులకు ఇబ్బందులు తప్పడం లేదు.

కలుషిత నీరు సరఫరా కాకుండా చర్యలు

తాగునీటి పథకం ద్వారా కలుషిత నీరు సరఫరా కాకుండా ప్రతి ట్యాంకు వద్ద నీరు శుద్ధి అయ్యేలా ఏర్పాట్లు చేయాలని నిర్ణయించాం. పైపుల లీకేజీ సందర్భంగా పంచాయతీ సిబ్బంది సరిగా వ్యవహరించకపోవడంతో నీరు బురదగా వస్తున్నది. ఇటువంటి అవాంతరాలు లేకుండా, ఇకపై ప్రతి ట్యాంకు వద్ద నీరు పూర్తిగా శుద్ధి అయ్యేలా చూస్తాం. పెద్ద ప్రాజెక్టు కావడం వల్ల పైపులైన్ల లీకేజీలు వస్తున్నాయి. వాటిని సరిదిద్దే ప్రయత్నం చేస్తున్నాం. - కనకమ్మ, జేఈ, ఆర్‌డబ్ల్యూఎస్, చోడవరం

మ్యాట్రిమోనీ మోసాలు

... 5వ పేజీ తరువాయి

ఫొటోలు, వీడియోలు పంపించి అందిన కాడికి దోచుకుంటున్నారు. విశాఖలోని ఓ మెకానికల్ ఇంజనీర్ కొద్దిరోజుల కిందట మ్యాట్రిమోనీ వెబ్‌సైట్‌లో తన వివరాలను రిజిస్టర్ చేశారు. కొద్దిరోజులకే అతనికి ఫోన్ వచ్చింది. తాను కూడా ఇంజనీరింగ్ పూర్తిచేసి ఉద్యోగాన్వేషణలో ఉన్నానని, మంచి సంబంధం కోసం అదే వెబ్‌సైట్‌లో పేరు నమోదు చేసుకున్నానని చెప్పింది. దీంతో బాధితుడు తన కుటుంబ వివరాలు, ఆర్థిక స్థితిగతులను వివరించాడు. అనంతరం ఇద్దరూ వాట్సాప్, ఇన్‌స్టాలో చాటింగ్ మొదలుపెట్టారు. కొద్దిరోజులకు తన పుట్టినరోజుని, బంగారు ఆభరణాల కొనుగోలు చేయాలని డబ్బులు అడిగింది. ఆ తర్వాత కూడా పలు కారణాలను చూపించి సుమారు రూ.26 లక్షలు వరకూ గుంజేసింది. ఇంకా డిమాండ్ చేస్తుండడంతో స్నేహితుల సూచనమేరకు సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదుచేశాడు. పోలీసులు దర్యాప్తు చేసి యువతి పేరుతో మోసం చేస్తున్న కొమ్మిగాని లోకేశ్‌ను ఈ నెల 24న హైదరాబాద్‌లో అరెస్టు చేశారు. అతడికి సహకరించిన ఆర్.సాయిధీరజ్‌తోపాటు మైకేల్‌షాలినీ పరారీలో ఉండడంతో వారి కోసం గాలిస్తున్నారు. అలాగే ఎంవీపీకాలనీకి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌కు కూడా ఇలాంటి అనుభవమే ఎదురైంది. హైదరాబాద్‌కు చెందిన బత్తిసాయిప్రియ అతడ్ని మోసం చేసి రూ.22 లక్షలు కొట్టేసింది. సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదుచేయడంతో ఆమెను ఈనెల 26న అరెస్టు చేశారు.

నైజీరియా వాసుల చేతిలో...

విశాఖకు చెందిన ఓ వైద్యురాలు తన భర్తతో విడిపోయారు. రెండో పెళ్లి కోసం వెబ్‌సైట్‌లో తన ప్రొఫైల్ రిజిస్టర్ చేశారు. ఆమె నంబరుకు అమెరికా నుంచి అంటూ ఓ వ్యక్తి ఫోన్‌చేశాడు. తనకు భారతీయురాలిని పెళ్లి చేసుకోవాలనే కోరిక ఉందని, సంపన్న కుటుంబానికి చెందిన వాడినని నమ్మించాడు. ఇద్దరు యువతులతో సముద్రంలో బోటింగ్ చేస్తున్న వ్యక్తిని తన తండ్రిగా పేర్కొంటూ ఓ ఫొటో, స్టెప్ మదర్‌గా పేర్కొంటూ మరొకరి ఫొటోను వైద్యురాలి వాట్సాప్‌కు పంపించాడు. మంచి ఇంటీరియల్ డెకరేషన్‌తో వున్న గదిలోని సీలింగ్‌కి ఫొటో తీసి తన బెడ్‌రూమ్‌గా చూపించాడు. తన కుటుంబంలో వ్యక్తిగత స్వేచ్ఛ ఎక్కువని ఆమెను మరింతగా ఆకర్షించాడు. దీంతో ఆమె పెళ్లికి సిద్ధమయ్యారు. దీంతో రెండు రోజుల్లో ఇండియా వస్తున్నానంటూ విమానం టిక్కెట్లను ఆమెకు వాట్సాప్ చేశాడు. అమెరికన్ కరెన్సీతోపాటు విలువైన బహుమతులు తెస్తున్నానని నమ్మించాడు. అయితే రెండు రోజుల తర్వాత తనను ఎయిర్‌పోర్టులో అధికారులు అడ్డగించారని, ఓ వ్యక్తితో కస్టమ్స్ అధికారిగా మాట్లాడించాడు. బహుమతులు తిరిగి అప్పగించాలంటే జరిమానా కట్టాలని చెప్పడంతో ఆమె సుమారు రూ.24.29 లక్షలు ట్రాన్స్‌ఫర్ చేశారు. తరువాత ఇంకా కావాలని కోరడంతో మోసపోయినట్టు గుర్తించి సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేయగా నిందితులు ఢిల్లీలో ఉంటున్నట్టు తేలింది. దీంతో అక్కడ నైజీరియాకు చెందిన ఒసాస్(38), అతనికి సహకరించిన మిస్లేయిర్‌ఖాన్(27)లను అరెస్టు చేశారు.

టిడ్కో ఇళ్లు.. లీకేజీలతో గొల్లు..

- రామ్‌నగర్‌లో గత టీడీపీ హయాంలో శంకుస్థాపన
- కొంత వరకు పూర్తి
- అంతలోనే ఎన్నికలు రావడంతో అధికారంలోకి వచ్చిన వైసీపీ
- చాలా కాలం ముందుకు సాగని పనులు
- ఆందోళనలతో 2021లో పూర్తి
- వర్షాలకు కారిపోతుండడంతో నివాసితులు ఆందోళన




కాలనీలోని ఓ ఇంట్లో ఫ్యాన్ ఉన్న చోట శ్లాబ్ లీకైన దృశ్యం



ఎలమంచిలి మునిసిపాలిటీ రామ్‌నగర్‌లో నిర్మించిన గృహ సముదాయం

ఎలమంచిలి, జూలై 28 : నిర్మాణం పూర్తయిన కొన్నాళ్లకు టిడ్కో ఇళ్లు పలుచోట్ల లీకేజీ అవుతుండడంతో ఆయా లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ఎలమంచిలి మునిసిపాలిటీ పరిధి రామ్‌నగర్ సమీపంలో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో వీటి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కొంత వరకు పనులు పూర్తయ్యాయి. ఇంతలో ఎన్నికలు వచ్చి వైసీపీ అధికారంలోకి రావడంతో చాలా కాలం పాటు పనులు ముందుకు సాగలేదు. దీంతో అవి నిరుపయోగంగా ఉండేవి. దీనిపై లబ్ధిదారుల విన్నపాలతో పాటు పత్రికల్లో పలుమార్లు కథనాలు ప్రచురితం కాడంతో ఎట్టకేలకు వైసీపీ పాలకులు స్పందించి నిర్మాణాలను పూర్తి చేశారు. 2021 జనవరి ఎనిమిదో తేదీన అప్పటి మంత్రి కె.కన్నబాబు, నాటి ఎలమంచిలి ఎమ్మెల్యే యువి.రమణమూర్తి రాజు ఈ గృహ సముదాయాన్ని ప్రారంభించారు. అనంతరం 432 మంది లబ్ధిదారులకు ఫ్లాట్‌లను పంపిణీ చేశారు. అయితే సౌకర్యాలు అంతంత మాత్రంగానే కల్పించారని అప్పట్లో నివాసితులు ఆరోపించేవారు. ప్రధానంగా తాగునీటి సమస్య ఉండేదని, దీనిని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకు వెళ్లడంతో అది పరిష్కారమైందని చెపుతున్నారు. ఇదిలావుంటే, గతంలో ఇళ్లు లీకవ్వడంతో అధికారులకు ఫిర్యాదులు చేయగా మరమ్మతులు చేయించారన్నారు. తాజాగా అల్పపడీనం కారణంగా కురిసిన వర్షాలకు మళ్లీ పలు ఇళ్లలో ఫాన్లు బిగించిన చోట, అల్మారాలు ఉన్నచోట తదితరాల్లో లీకవుతున్నాయని పలువురు వాపోతున్నారు. అల్పాదాయ వర్గాలకు చెందిన తాము పెద్ద మొత్తంలో అద్దెలు చెల్లించలేక ప్రభుత్వం ఇచ్చిన ఈ ఇళ్లలో నివాసం ఉంటున్నామన్నారు. అష్టకష్టాలు పడి నెల నెలా వీటికి సంబంధించిన రుణాలను బ్యాంకుకు చెల్లిస్తున్నామన్నారు. ప్రస్తుతం ఇళ్లు కారుతుండడంతో భయాందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఇటువంటి ఇళ్లను గుర్తించి మరమ్మతులు చేపట్టాల్సిందిగా వారంతా కోరుతున్నారు.



మరమ్మతు పనులు చేపట్టినా లీకవుతున్న ఓ ఫ్లాట్‌లోని లోపలి భాగం

ఐదు దశాబ్దాలు గడిచినా వీడని స్నేహ సుగంధం

- కోటవురట్ల ప్రభుత్వ హైస్కూల్‌లో అ'పూర్వ' కలయిక



కోటవురట్ల పాఠశాలలో కలుసుకున్న 1968-69 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

కోటవురట్ల, జూలై 28 : మండల కేంద్రం కోటవురట్ల హైస్కూల్‌లో పూర్వ విద్యార్థులు సందడి చేశారు. 1968-69 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న వీరంతా ఆదివారం సమావేశమయ్యారు. 54 సంవత్సరాల తరువాత అంతా కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధులు లేవు. తొలుత ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకుని యోగక్షేమాలు తెలుసుకున్నారు. నాడు తాము చదువుకున్న రోజుల్లో మధుర స్మృతులను కాసేపు జ్ఞప్తికి తెచ్చుకుని సంబరపడ్డారు. రాజుపేట గ్రామానికి చెందిన యల్లపు వెంకటరమణ, కోటవురట్ల దాసరి వెంకట్రావుల ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ పూర్వ కలయిక సాయంత్రం వరకు ఆనందగా సాగింది. అనంతరం నాడు ఉన్నత చదువులు చదువుకున్న రాజాసాగి రామచంద్రరాజును ఘనంగా సత్కరించారు.

'మాస్' ఆధ్వర్యంలో 150 మంది రక్తదానం

అనకాపల్లి టౌన్, జూలై 28 : ఇక్కడి నాయుళ్ల వీధిలోని సిటీ పబ్లిక్ స్కూల్ ఆవరణలో 1987-88 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు (మిత్ర అసోసియేషన్ ఫర్ సోషల్ సర్వీస్), ఏఎస్ రాజా బ్లడ్‌బ్యాంక్ పర్యవేక్షణలో ఆదివారం భారీ రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఏటా ఫ్రెండ్‌షిప్ డేను పురస్కరించుకుని 'మాస్' ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని నిర్వహిస్తుండడం ఆనవాయితీ. ఇందులో భాగంగా స్థానిక సిటీ పబ్లిక్ స్కూల్ ఆవరణలో సుమారు 150 మందితో రక్తదాన శిబిరం నిర్వహించినట్టు అసోసియేషన్ సభ్యులు గుండా సాయి, షేక్ జిలానీ బాషా తెలిపారు. వివిధ ప్రాంతాల్లో ఉద్యోగ, వ్యాపారాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులంతా ఇక్కడికి విచ్చేసి రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేశారన్నారు. తమ అసోసియేషన్ తరపున ఏటా క్రమం తప్పకుండా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. పేద విద్యార్థులను చదివించడం, ఆర్థికంగా వెనుకబడిన స్నేహితులకు చేయూత ఇవ్వడం, వృద్ధాశ్రమానికి సహాయం అందించడం, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు 'మేము సైతం' అంటూ పేదలకు చేయూతనివ్వడం వంటి కార్యక్రమాలు చేపడుతున్నట్టు వివరించారు. భవిష్యత్తులో ఇదే స్ఫూర్తితో మరిన్ని సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని అసోసియేషన్ ప్రతినిధులు గుండా సాయి, షేక్ జిలానీ బాషా, బి.రామకృష్ణ, పి.శివకుమార్ తదితరులు తెలిపారు.



రక్తదానం చేస్తున్న పూర్వపు విద్యార్థులు

శాకంబరిగా నూకాంబిక అమ్మవారు



ఎస్.రాయవరం, జూలై 28 : ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని ఎస్.రాయవరంలో నూకాంబిక అమ్మవారు శాకంబరిగా ఆదివారం భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధి సోమిరెడ్డి రాజు తదితరుల ఆధ్వర్యంలో వేకువజామున అమ్మవారిని ఆకుకూరలు, వివిధ రకాల పండ్లతో అలంకరించారు. పూజల అనం తరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటైంది. ఈ కార్యక్రమలో నిర్వాహకులు దుబాసి నవీన్, ఈతకోటి నాగు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

'బాల్య వివాహాల వల్ల అనర్థాలు'



సీతంపాలెంలో అగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

నక్కపల్లి, జూలై 28 : బాల్య వివాహాల వల్ల ఆడపిల్లల భవిష్యత్ నాశనమవుతుందని పెదబోదిగల్లం హైస్కూల్ తెలుగు పండిట్ ఎన్‌వీఎస్ ఆచార్యులు అన్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై సీతంపాలెంలో ఆదివారం ఏర్పాటైన అవగాహన ర్యాలీలో మాట్లాడారు. బడి ఈడు పిల్లలను పాఠశాలలకు పంపించి చదివించాలని తల్లిదండ్రులకు సూచించారు. వివాహ వయస్సు రాకుండా ఎవరైనా బాల్య వివాహాలు చేసినా, ప్రోత్సహించినా చట్ట ప్రకారం నేరమన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గొర్ల నాగ విజయలక్ష్మి, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

శివాలయం నిర్మాణానికి భక్తులు విరాళాలు

సబ్బవరం, జూలై 28 : మండల కేంద్రం సబ్బవరంలో పురాతన శివాలయం పునర్నిర్మాణానికి పలువురు భక్తులు ఆర్థిక సాయం అందించారు. ఇందులో భాగంగా ఆదివారం సబ్బవరం గెడ్డం వీధికి చెందిన సబ్బవరపు ఈశ్వరరావు, లక్ష్మి దంపతలు రూ.20,116, యడ్ల నాయుడు దంపతులు రూ.50,116లను ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు దంగేటి నానిబాబు, బర్ల రమణ, కొరాడ శ్రీను, చింతల శ్రీనులకు అందజేశారు.

పుస్తక పఠనంతో అపార జ్ఞానం

అచ్యుతాపురం, జూలై 28 : పుస్తక పఠనం ద్వారా అపార జ్ఞానాన్ని సంపాదించవచ్చని గ్రంథాలయాధికారి బి.కోటేశ్వరరావు అన్నారు. ఆదివారం స్థానిక గ్రంథాలయంలో చదవటం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ, విదేశాల్లో పర్యటించకపోయినా పుస్తక పఠనం ద్వారా అన్ని విషయాలను సమగ్రంగా తెలుసుకోవచ్చునన్నారు. అన్ని వర్గాల ప్రజలు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

చోడపల్లిలో భయపెట్టిన కొండచిలువ



గ్రామస్థుల చేతిలో హతమైన కొండచిలువ

అచ్యుతాపురం, జూలై 28 : మండలంలోని చోడపల్లిలో కొండచిలువ గ్రామస్థులను భయపెట్టింది. గ్రామంలో వీధి దీపాలు వెలగడం లేదు. ఆదివారం రాత్రి కొందరు మహిళలు బయట కూర్చొని సరదాగా మాట్లాడుకుంటున్నారు. ఇంతలో పాము పాకినట్టు శబ్దం రావడాన్ని గుర్తించారు. కానీ వీధి దీపాలు లేకపోవడంతో కనిపెట్టలేకపోయారు. ఆ సమయంలో స్కూటీపై ఓ వ్యక్తి అక్కడికి రావడంతో ఆ వెలుగులో మహిళల పక్కనే ఉన్న సుమారు పది అడుగుల పొడవు గల కొండ చిలువ ముడుచుకుని ఉండడాన్ని చూశారు. దీంతో వారంతా ఒక్కసారిగా హడలిపోయి కేకలు వేశారు. ఎంత అదిరించినా అక్కడి నుంచి కదలకపోవడంతో చేసేది లేక గ్రామస్థులు దానిని హతమార్చారు.

పౌరాణిక నాటకాల్లో మెప్పించిన 'మిర్తిపాటి'

కొత్తూరు, జూలై 28 : ప్రముఖ రంగస్థల నటుడు మిర్తిపాటి ఈశ్వరరావు సంతాప సభ పిసినికాడ పంచాయతీ రామభద్రపురం కాలనీలో ఆదివారం ఏర్పాటైంది. చిత్రకారుల సంఘం మాజీ అధ్యక్షుడు దేవాదుల ప్రకాశరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఈశ్వరరావు చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పౌరాణిక నాటకాల ద్వారా తెలుగు రాష్ట్రాల అభిమానుల మదిలో ఈశ్వరరావు స్థానం సంపాదించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో దేవాదుల శివాజీ, పొలిమేర మణి, ఎం.జగన్నాథరావు, కంకిపాటి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి'

ఎలమంచిలి, జూలై 28 : ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ సమాజాభివృద్ధికి పాటుపడుతున్న జర్నలిస్టుల సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. ఆదివారం ఇక్కడ ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో ఏర్పాటైన ప్రెస్‌క్లబ్ సమావేశంలో ఆయన మాట్లాడారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. తన సొంత ఖర్చులతో విలేకరుల కోసం శిక్షణ తరగతులు ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. ప్రెస్‌క్లబ్ కార్యదర్శి ఆడారి గంగాధర్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి కోరాడ చంద్రరావు, మాజీ అధ్యక్షుడు స్వామి, రాష్ట్రకౌన్సిల్ సభ్యుడు మద్దాల రాంబాబు, ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర కార్యదర్శి కిశోర్ తదితరులతో పాటు మూడు మండలాల జర్నలిస్టులు పాల్గొన్నారు.

ఆషాఢం సందర్భంగా ఊరూరా.. అమ్మవార్ల వేడుకలు



బురదాలంబ అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే సుందరపు, ప్రగడ

ఎలమంచిలి, జూలై 28 : మునిసిపాలిటీ పరిధి తెరువుపల్లి వార్డులో బురదాలంబ అమ్మవారి జాతర ఆదివారం అత్యంత ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి పసుపు కుంకుమలను సమర్పించి మొక్కులను చెల్లించుకున్నారు. అమ్మవారిని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు తదితర నేతలు వేర్వేరుగా దర్శించుకున్నారు. ఈ వేడుకలో భాగంగా నియోజకవర్గ స్థాయి కబడ్డీ పోటీలు ఉత్సాహభరిత వాతావరణంలో సాగాయి. అలాగే, రామారాయుడుపాలెంలో పోలిమేరమ్మ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని ఎమ్మెల్యేతో పాటు జనసేన పార్టీ నాయకులు బొద్దపు శ్రీను, గల్లా నూకు నాయుడు, పిల్లా సత్యనారాయణ, పిల్లా గంగాధర్, డి.పైడియ్య, టి.గంగాధరరావు తదితరులు దర్శించుకున్నారు.

నక్కపల్లి : మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం మరిణమ్మతల్లి జాతరను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా సీహెచ్‌ఎల్ పురంలో నిర్వాహకులు సంతోషిమాత ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేపట్టారు. అమ్మవారి విగ్రహాన్ని సుందరంగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన జరిపారు. జడ్పీ కో-ఆప్షన్ మాజీ సభ్యుడు కురందాసు నూకరాజు, ఉపమాక దేవస్థానం మాజీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి, జగదీశ్వరరావు, దిలీప్, వాసు, హరి, గురుభవానీలు తంగెళ్ల నానాజీ, సతీశ్, జ్యోతి, తంగెళ్ల శ్రీను, గ్రామ పెద్దలు రాజబాబు, చినకాపు తదితరులు పాల్గొన్నారు.



నక్కపల్లి: సీహెచ్‌ఎల్‌పురంలో...



ఎస్.రాయవరం : జేవీపాలెంలో...

ఉపమాకలో శెట్టిబలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో గ్రామ పెద్దలు, శెట్టిబలిజ సంక్షేమ సంఘం ప్రతినిధులతో పాటు పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : నునపర్తిలో పసలమారెమ్మ తల్లి పండగను ఆదివారం వైభవోపేతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచి అమ్మవారి దర్శనానికి భక్తుల రాక ఆరంభమైంది. పసుపు కుంకుమలను సర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు అసౌకర్యాలు తలెత్తకుండా నిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రెడ్డి నగేష్, గొంప నరసింహనాయుడులతో తదితరులు పాల్గొన్నారు.

కశింకోట : వెదురుపర్తిలో సత్తెమ్మతల్లి పండగను ఆదివారం నేత్రపర్వంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచి పూజలు ప్రారంభమయ్యాయి. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఆయనను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నేతలు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం : ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని మండలంలోని జేవీపాలెంలో నూకాంబిక అమ్మవారి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచి పూజలు ప్రారంభమయ్యాయి. సర్పంచ్ వజ్రపు కృష్ణకుమారి, టీడీపీ సీనియర్ నాయకుడు శంకరరావు దంపతులు, ఎంపీటీసీ సభ్యురాలు కె.మంగ దంపతుల ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో మహిళలు ఘటాలను తలపై పెట్టుకుని ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి సమర్పించారు. మధ్యాహ్నం ఆలయం ఆవరణలో భారీ అన్నసమారాధన ఏర్పాటైంది.


సామాజిక బాధ్యతగా మొక్కలు నాటాలి



మొక్క నాటుతున్న మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద

తుమ్మపాల, జూలై 28 : సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ పిలుపునిచ్చారు. వన మహోత్సవంలో భాగంగా ఆదివారం మాకవరంలో నాయకులతో కలిసి మొక్కలు నాటారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించే బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రస్తుతం గ్రామాలు కాలుష్యం కోరల్లో చిక్కుకుంటున్నాయని, దీని నుంచి బయటపడేందుకు పచ్చదనాన్ని పెంపొందించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మొయ్య భవాని, మొయ్యా నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

'దళితుల సమస్యల పరిష్కారానికి కృషి'



సమావేశమైన దళిత సంఘం నాయకులు

తుమ్మపాల, జూలై 28 : దళితుల సమస్యలు పరిష్కారానికి కృషి చేయనున్నట్టు దళిత సంఘం నాయకులు రేబాక మధు తెలిపారు. ఆదివారం సీపీఐ ఇక్కడి కార్యాలయంలో దళిత సంఘం నాయకులతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. తొలుత జైభీమ్‌సేన సేవా సంఘం మండలాల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గం దళితుల సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కారానికి చొరవ చూపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

భూ రికార్డులకు పటిష్ఠ భద్రత

... 5వ పేజీ తరువాయి

పేర్కొన్నారు. రెవెన్యూ రికార్డుల విషయంలో ఎవరైనా అనుమానంగా ప్రవర్తించినా, రికార్డులను తీసుకెళ్లే ప్రయత్నం చేసినట్టు గుర్తించినా వెంటనే పోలీసులకు అధికారులు ఫిర్యాదు చేయాలని స్పష్టం చేశారు.

కీలక భూ రికార్డుల విషయంలో అప్రమత్తం

మండల తహసీల్దారు కార్యాలయాల్లో చుక్కల భూములు, 22ఏ, ల్యాండ్ కన్వర్షన్, అసైన్మెంట్, అలినేషన్ తదితర భూ కేటాయింపుల మాన్యువల్ ఫైళ్లకు జెరాక్స్ సెట్‌లను సిద్ధం చేయాలని ఆదేశించారు. అంతే కాకుండా తహసీల్దారు కార్యాలయాల్లో భూములకు సంబంధించిన, రోజువారీ జరిగే రెవెన్యూ లావాదేవీల విషయంలో కీలక ఫైళ్ల భద్రత, నిర్వహణపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆర్డీవోలు, తహసీల్దార్లు రెవెన్యూ రికార్డులు భద్రపరిచే గదులను అవకాశం ఉన్నప్పుడల్లా ప్రత్యేక తనిఖీలు చేయాలని సూచించారు.

సీసీ కెమెరాల ఏర్పాటు

తహసీల్దారు కార్యాలయాల్లో కీలక రెవెన్యూ రికార్డులు భద్రపరిచిన గదుల బయట, లోపల, ప్రవేశ ద్వారాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. రికార్డు గది నిర్వహణకు ప్రత్యేకంగా ఒక గుమస్తాను నియమించి ఆయనతో సీసీ కెమెరాల నిఘా కొనసాగించాలని నిర్ణయించారు. తహసీల్దారు కార్యాలయాల్లో పురాతన మాన్యువల్ రికార్డులతో పాటు, 22ఏ భూ రికార్డులు, భూ వివాదాలకు సంబంధించిన ఆర్‌వోఆర్ రికార్డులు, వ్యవసాయ భూముల నుంచి కన్వర్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న ఫైళ్లు, ఇళ్ల స్థలాల కేటాయింపుల ఫైళ్లు, ఆర్‌టీఏ, అసైన్డ్, వెబ్‌ల్యాండ్, డీకేటీ తదితర రికార్డులను తనిఖీలు చేసి అవసరం మేరకు భద్రత చర్యలు చేపడుతున్నారు. ప్రస్తుతం ఎన్నికల ముందు జిల్లాకు వచ్చిన తహసీలార్లు బదిలీపై వెళ్లడం, కొత్తగా తహసీల్దార్లు బదిలీపై జిల్లాకు రానున్న నేపథ్యంలో ప్రభుత్వం జారీ చేసిన రెవెన్యూ రికార్డుల భద్రతా చర్యలు డిప్యూటీ తహసీల్దార్ల పర్యవేక్షణలో జరుగుతున్నాయి

స్టాండింగ్ కమిటీ ఎన్నికకు నేడు కూటమి అభ్యర్థుల నామినేషన్

... 5వ పేజీ తరువాయి

స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఖరారవగానే అదనపు కమిషనర్ డాక్టర్ వై.శ్రీనివాసరావుకు నామినేషన్లు అందజేస్తారు. మరోవైపు వైసీపీ కార్పొరేటర్లు కూడా స్టాండింగ్ కమిటీ ఎన్నికలో పోటీ చేయాలని నిర్ణయించారు. ఇప్పటికే వైసీపీ కార్పొరేటర్లు తోట పద్మావతి, బిపిన్ కుమార్‌జైన్, సక్కెళ్ల లక్ష్మి, పల్లా అప్పలకొండ, అక్కరమాని రోహిణి, రెయ్యి వెంకటరమణ, సాడి పద్మారెడ్డి, గుండపు నాగేశ్వరరావు, ముర్రువాణి, మహ్మద్ ఇమ్రాన్ పేర్లను ఎంపిక చేసి పార్టీ అధిష్ఠానానికి పంపించినట్టు తెలిసింది. అయితే అటు నుంచి ఇంకా స్పందన రాకపోవడంతో మంగళవారం నామినేషన్లు దాఖలు చేయాలని నిర్ణయించారు.

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం : ఎమ్మెల్యే రాజు



ఎమ్మెల్యే రాజుతో లయన్స్ క్లబ్ ప్రతినిధులు

చోడవరం, జూలై 28 : సమాజంలో ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణను బాధ్యతగా తీసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు అన్నారు. ఆదివారం స్థానిక లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పర్యావరణ కోసం లయన్స్ క్లబ్ కార్యవర్గం చేస్తున్న కార్యక్రమాన్ని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లునాయుడు, మాజీ ఎంపీపీ పెదబాబు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు పసుమర్తి సాంబ, వాణీబాబు, కాంట్రాక్టర్ సత్యనారాయణ, వేపాడ సత్యనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా తల్లిదండ్రుల దినోత్సవం



తల్లిదండ్రుల దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

బుచ్చెయ్యపేట, జూలై 28 : విజయరామరాజుపేట హైస్కూల్‌లో ఆదివారంఅతిథిదేవోభవ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా తల్లిదండ్రుల దినోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా తలిదండ్రులకు పిల్లలు పాదాభివందనం చేశారు. ఈ సందర్భంగా సంస్థ కార్యదర్శి ఆరిపాక కామేశ్వరరావు మాట్లాడుతూ కనిపించే దేవుళ్ళు తల్లిదండ్రులన్నారు. వారు చూపే నిస్వార్థ ప్రేమ పిల్లలను తీర్చిదిద్దడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు పలు చారిత్రాత్మక పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్ చినసూర్యానారాయణ, హెచ్ఎం కె.ఉదయభాస్కర్, ఏ.రవికుమార్, బి.ముత్యాలనాయుడు, డి.సత్యవేణి, కె.కోటి, పి.పార్వతి, వీవీ శుభలక్ష్మి పాల్గొన్నారు.

ముగిసిన ఆధార్ నమోదు శిబిరాలు



కుసర్లపూడి అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు ఆధార్ నమోదు

రోలుగుంట, జూలై 28 : అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐదేళ్లలోపు చిన్నారులకు ఉచితంగా ఆధార్ సేవలను అందించినట్టు కామన్ సర్వీసు సెంటర్ (సీఎస్సీ) వీఎల్ఈ నాయుడు పేర్కొన్నాడు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 23 నుంచి 28 వరకు గ్రామాల్లో ఆధార్ శిబిరాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఇందులో భాగంగా కుసర్లపూడి, జానకిరాంపురం గ్రామాల అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉచిత ఆధార్ నమోదు శిబిరాలను నిర్వహించారు. ఈ ఐదు రోజుల పాటు 30 అంగన్‌వాడీ కేంద్రాల్లో 150 మందికి పైగా చిన్నారులకు ఆధార్ నమోదు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక అంగన్‌వాడీ కార్యకర్తలు చంద్రావతి, జగద పాల్గొన్నారు.

మెకానిల్ షాపులో చోరీ

మాకవరపాలెం, జూలై 28 : మండల కేంద్రంలోని ఓ మెకానిక్ షాపులో చోరీ జరిగింది. జంగాలపల్లి గ్రామానికి చెందిన సింగంపల్లి రమణకు మాకవరపాలెంలో వ్యవసాయ మోటర్లు మరమ్మతు చేసే షాపు ఉంది. ఈ షాపులో శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు మూడు వ్యవసాయ మోటార్లు, రూ.లక్ష విలువైన సామగ్రిని చోరీ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ రామకృష్ణారావు తెలిపారు.

కలుషిత జల్ ఇంకెన్నాళ్లు?

... 5వ పేజీ తరువాయి

కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా చేపట్టడంతో సమస్యలు ఎదురవుతున్నాయి. జన్నవరం వద్ద పెద్దేరు నది నుంచి నీటిని పైపుల ద్వారా చోడవరం పట్టణంలోని ట్యాంకులకు సరఫరా చేసి ప్రజలకు ఇంటింటికీ తాగునీరు అందించాలన్నది జల్‌జీవన్ మిషన్ ప్రాజెక్టు ఉద్దేశం. ఈ మేరకు పట్టణంలోని అనేక వీధుల్లోని రోడ్లను తవ్వి మరీ పైపులైన్లు ఏర్పాటు చేయడంతో పాటు ఆరు వేల నివాసాలకు కొళాయి కనెక్షన్లు కూడా ఇచ్చారు. అయినా ఇంటింటికీ వేసిన కొళాయిల ద్వారా నీరు సరిగా రావడం లేదు సరికదా, కొళాయిల నుంచి తరచూ బురదనీరు సరఫరా అవుతోంది. ఇంటింటికీ కొళాయి పేరుతో ఇప్పటికే వీధుల్లో రోడ్లను తవ్వి మరీ పైపులైన్లు వేశారు. తీరా మళ్లీ ఇప్పుడు లీకులంటూ మళ్లీ గోతులు తవ్వుతుండడం, తిరిగి లీకులు సరిచేసి గోతులు కప్పుతుండడంతో రహదారులు అధ్వానంగా తయారై వాహనచోదకులకు ఇబ్బందులు తప్పడం లేదు.

కలుషిత నీరు సరఫరా కాకుండా చర్యలు

తాగునీటి పథకం ద్వారా కలుషిత నీరు సరఫరా కాకుండా ప్రతి ట్యాంకు వద్ద నీరు శుద్ధి అయ్యేలా ఏర్పాట్లు చేయాలని నిర్ణయించాం. పైపుల లీకేజీ సందర్భంగా పంచాయతీ సిబ్బంది సరిగా వ్యవహరించకపోవడంతో నీరు బురదగా వస్తున్నది. ఇటువంటి అవాంతరాలు లేకుండా, ఇకపై ప్రతి ట్యాంకు వద్ద నీరు పూర్తిగా శుద్ధి అయ్యేలా చూస్తాం. పెద్ద ప్రాజెక్టు కావడం వల్ల పైపులైన్ల లీకేజీలు వస్తున్నాయి. వాటిని సరిదిద్దే ప్రయత్నం చేస్తున్నాం.

- కనకమ్మ, జేఈ, ఆర్‌డబ్ల్యూఎస్, చోడవరం

భూ రికార్డులకు పటిష్ఠ భద్రత

... 5వ పేజీ తరువాయి

పేర్కొన్నారు. రెవెన్యూ రికార్డుల విషయంలో ఎవరైనా అనుమానంగా ప్రవర్తించినా, రికార్డులను తీసుకెళ్లే ప్రయత్నం చేసినట్టు గుర్తించినా వెంటనే పోలీసులకు అధికారులు ఫిర్యాదు చేయాలని స్పష్టం చేశారు.

కీలక భూ రికార్డుల విషయంలో అప్రమత్తం

మండల తహసీల్దారు కార్యాలయాల్లో చుక్కల భూములు, 22ఏ, ల్యాండ్ కన్వర్షన్, అసైన్మెంట్, అలినేషన్ తదితర భూ కేటాయింపుల మాన్యువల్ ఫైళ్లకు జెరాక్స్ సెట్‌లను సిద్ధం చేయాలని ఆదేశించారు. అంతే కాకుండా తహసీల్దారు కార్యాలయాల్లో భూములకు సంబంధించిన, రోజువారీ జరిగే రెవెన్యూ లావాదేవీల విషయంలో కీలక ఫైళ్ల భద్రత, నిర్వహణపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆర్డీవోలు, తహసీల్దార్లు రెవెన్యూ రికార్డులు భద్రపరిచే గదులను అవకాశం ఉన్నప్పుడల్లా ప్రత్యేక తనిఖీలు చేయాలని సూచించారు.

సీసీ కెమెరాల ఏర్పాటు

తహసీల్దారు కార్యాలయాల్లో కీలక రెవెన్యూ రికార్డులు భద్రపరిచిన గదుల బయట, లోపల, ప్రవేశ ద్వారాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. రికార్డు గది నిర్వహణకు ప్రత్యేకంగా ఒక గుమస్తాను నియమించి ఆయనతో సీసీ కెమెరాల నిఘా కొనసాగించాలని నిర్ణయించారు. తహసీల్దారు కార్యాలయాల్లో పురాతన మాన్యువల్ రికార్డులతో పాటు, 22ఏ భూ రికార్డులు, భూ వివాదాలకు సంబంధించిన ఆర్‌వోఆర్ రికార్డులు, వ్యవసాయ భూముల నుంచి కన్వర్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న ఫైళ్లు, ఇళ్ల స్థలాల కేటాయింపుల ఫైళ్లు, ఆర్‌టీపీ, అసైన్డ్, వెబ్‌ల్యాండ్, డీకేటీ తదితర రికార్డులను తనిఖీలు చేసి అవసరం మేరకు భద్రత చర్యలు చేపడుతున్నారు. ప్రస్తుతం ఎన్నికల ముందు జిల్లాకు వచ్చిన తహసీలార్లు బదిలీపై వెళ్లడం, కొత్తగా తహసీల్దార్లు బదిలీపై జిల్లాకు రానున్న నేపథ్యంలో ప్రభుత్వం జారీ చేసిన రెవెన్యూ రికార్డుల భద్రతా చర్యలు డిప్యూటీ తహసీల్దార్ల పర్యవేక్షణలో జరుగుతున్నాయి.

శిథిలావస్థలో బీసీ హాస్టల్

- వర్షం వస్తే కారిపోతున్న భవనం
- రాలిపోతున్న శ్లాబ్ పెచ్చులు
- పూర్తిగా పాడైన మరుగుదొడ్లు
- ఏళ్లు తరబడి కొరవడిన మరమ్మతులు
- సౌకర్యాలు లేక తగ్గుతున్న విద్యార్థుల సంఖ్య



బీసీ బాలుర హాస్టల్ భవనం



పెచ్చులూడుతున్న పై కప్పు



అధ్వానంగా ఉన్న మరుగుదొడ్లు

కె.కోటపాడు, జూలై 28 : మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతిగృహం శిథిలావస్థకు చేరింది. వర్షం వస్తే భవనం కారిపోతున్నది. శ్లాబ్ పెచ్చులు రాలిపోతున్నాయి. మరుగుదొడ్లు పాడయ్యాయి. దీంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఒకప్పుడు ఇక్కడ హాస్టల్ సీటు కోసం తల్లిదండ్రులు తీవ్ర ప్రయత్నాలు చేసేవారు. ప్రస్తుతం సౌకర్యాలు లేకపోవడంతో తల్లిదండ్రులు విముఖత చూపుతున్నారు.

కె.కోటపాడు వసతిగృహంలో 100 మంది విద్యార్థులు ఉండేవారు. ఇక్కడ చదువుకునే విద్యార్థులు ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారు. ఇక్కడ సీటు కోసం విద్యార్థుల తల్లిదండ్రులు పోటీ పడేవారు. పొరుగు మండలాల నుంచి కూడా తీవ్ర పోటీ ఉండేది. ఇక్కడ సీటు కోసం ఎమ్మెల్యేలు, ఎంపీలు, రాజకీయ నేతలతో సిఫార్సులు చేయించేవారు. ప్రస్తుతం ఈ హాస్టల్‌లో పిల్లల్ని చేర్పించేందుకు తల్లిదండ్రులు విముఖత చూపుతున్నారు. గతంలో 100 మంది విద్యార్థులు ఉండే ఈ హాస్టల్‌లో ప్రస్తుతం 30 మంది మాత్రమే ఉన్నారు. వర్షం వస్తే పూర్తిగా భవనం పూర్తిగా కారిపోతున్నది. శ్లాబు పెచ్చులూడి పడిపోతున్నాయి. దీంతో పెచ్చులు ఎప్పుడు తమ మీద పడిపోతాయోనని విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ హాస్టల్‌లో ఉంటున్నారు. మరుగుదొడ్లు పూర్తిగా పాడయ్యాయి. తలుపులు ఊడిపోయాయి. వర్షం వస్తే వార్డెన్ గది కూడా కారిపోతున్నది. సౌకర్యాలు లేకపోవడంతో ఈ హాస్టల్‌లో పిల్లలను చేర్పించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపడం లేదు. హాస్టల్ భవనాల కొత్తవి నిర్మించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

అధికారుల దృష్టికి తీసుకెళ్లా

- ఎస్.నాగభూషణం, వార్డెన్, కె.కోటపాడు



హాస్టల్ శిథిలావస్థకు చేరుకుంది. భవనం గురించి వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి దృష్టికి తీసుకు వెళ్లాను. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి వెళ్లడంతో సీఎస్ఆర్ నిధుల ద్వారా హాస్టల్ మరమ్మతులు చేయడానికి మెట్రోకెమ్ ఏపీఐ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ ముందుకొచ్చింది. కానీ నేటికీ ఎటువంటి మరమ్మతులు చేయడానికి కంపెనీ ప్రతినిధులు ముందుకు రాలేదు. హాస్టల్‌లో వసతులు సరిగా లేకపోవడం వల్ల విద్యార్థుల సంఖ్య తగ్గుతుంది.

వరినాట్లు వేసేందుకు మహిళా కూలీల కొరత

- రోజు కూలి రూ.600 డిమాండ్
- ఖర్చు తలచుకుని దిగులు పడుతున్నరైతులు



ఇతర ప్రాంతాల నుంచి కూలీలను తీసుకొస్తున్న దృశ్యం

రావికమతం, జూలై 28 : ఈ ఏడాది విరివిగా వర్షాలు పడడంతో రైతులు వరినాట్లు వేసేందుకు దమ్ములు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మహిళా రైతు కూలీల కొరత వేధిస్తోంది. డిమాండ్‌కు సరిపడా కూలీలు లభించక రైతులు ఇబ్బంది పడుతున్నారు. పక్క గ్రామాలు, దూర ప్రాంతాల నుంచి కూలీలను రప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు.

మండలంలో ఈ ఏడాది ఖరీఫ్ సాగు 2025 హెక్టార్లలో కాగా, కల్యాణపులోవ ఆయకట్టు మినహా మిగిలిన ఆయకట్టు భూములన్నీ వర్షాధారమే. అయితే ఈ ఏడాది వర్షాలు పడడంతో చెరువులు, వాగుల్లో నీరు చేరింది. దీంతో రైతులు దమ్ములకు దిగారు. కానీ, వరి నాటు వేసుందుకు కూలీల సమస్య ఏర్పడింది. సాధారణంగా మహిళ కూలీకి రోజు రూ.300లు ఉండేది. ప్రస్తుతం అందరూ ఇంచుమించు ఒకేసారి వరినాట్లు వేస్తుండడంతో రోజు కూలి రూ.500 నుంచి రూ.600 డిమాండ్ చేస్తున్నారు. ఇది రైతులకు ఆర్థిక భారం కలిగిస్తుంది. తప్పనిసరి పరిస్థితుల్లో కూలీలు అడిగిన పైకం ఇచ్చి వరినాట్లు వేస్తున్నా మని పలువురు రైతులు వాపోతున్నారు. వరి నాట్లు వేసిన తర్వాత కలుపు తీయడం, ఎరువులు వేయడం,ఏవైనా తెగుళ్ల సోకితే వాటికి మందులు వేయడం.. ఇలా ఖర్చు తలచుకుంటేనే భయం వేస్తోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంటికి పంట వచ్చేసరికి ఖర్చు తడిసి మోపెడు అయ్యేలా ఉందని అంటున్నారు.



ట్రాక్టర్‌తో దమ్ములు చేస్తున్న దృశ్యం

ముమ్మరంగా వరినాట్లు

బుచ్చెయ్యపేట, జూలై 28 : ముందస్తు వర్షాలు కురవడంతో మండలంలో ఈ ఏడాది సుమారు నెల ముందే రైతులు వరినాట్లు వేస్తున్నారు. మండలంలో సాధారణ వరి విస్తీర్ణం 6 వేల 700 ఎకరాలు. వర్షాలకు వాగులు, వంకలు, గెడ్డలు, పెద్దేరు, తాచేరు, బొడ్డేరు నదులు నీటి ప్రవాహంతో పరవళ్లు తొక్కుతున్నాయి. దీంతో గంటికొర్లాం, కోమళ్లపూడి, పొట్టిదొరపాలెం, ఎల్.సింగవరం, ఎల్‌బీపీ అగ్రహారం, లోపూడి, బంగారుమెట్ట, లూలూరు, భట్లోవ, వడ్డాది, విజయరామరాజుపేట, చినఅప్పన్నపాలెం, పొలేపల్లి, మంగళాపురం తదితర గ్రామాల్లో రైతులు వరిసాగు పనుల్లో నిమగ్నమైయ్యారు. ట్రాక్టర్లుతో పొలాలను ముమ్మరంగా దమ్ములు చేపట్టారు. గట్లేత, వరినారు తీత, నాట్లు వేసే పనిలో రైతులు తలమునకలు కావడంతో పొలాల్లో సందడి వాతావరణం నెలకొంది. అన్ని గ్రామాల్లో వరి నాట్లు ఒక్కసారిగా చేపట్టడంతో కూలీలకు డిమాండ్ ఏర్పడింది. దీంతో కూలీల ధరలు పెరిగాయి. కాగా ఎకరా దమ్ములో అరబస్తా డీఏపీ, 10 కెజీల పొటాష్ రసాయనిక ఎరువులను వేసుకోవాలని ఏవో భాస్కరరావు రైతులకు సూచించారు.

కృష్ణాదేవిపేట : గొలుగొండ మండలంలో వారం రోజులుగా కురుస్తున్నవర్షాలకు రైతులు వరినాట్లు వేసే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. పాతకృష్ణాదేవిపేట, చోద్యం, కొంగసింగి, లింగంపేట, ఏఎల్‌పురం, సీహెచ్ నాగాపురం తదితర గ్రామాల్లో వరినాట్లు వేసేందుకు దమ్ములు చేస్తున్నారు. ప్రస్తుతం కురిసిన భారీ వర్షాల వల్ల ఖరీఫ్‌కు సాగునీటి సమస్య లేనట్టేనని రైతులు చెబుతున్నారు.



వరినాట్లు వేస్తున్న వ్యవసాయ కూలీలు

భవిష్యత్తులోనూ 'కూటమి'కే విజయాలు

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు తాతయ్యబాబు
- ఎన్నికల్లో అధిక మెజార్టీ అందించిన గ్రామాల కార్యకర్తలకు ప్రోత్సాహకాలు



జైతవరం, అర్జునగిరి గ్రామాల కూటమి కార్యకర్తలకు నగదు అందజేస్తున్న తాతయ్యబాబు, సురేశ్‌నాయుడు

చీడికాడ, జూలై 28 : అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో చూపిన చొరవను చూపడం, కష్టపడడం ద్వారా భవిష్యత్తులోనూ కూటమి పార్టీల విజయాలు కొనసాగాలని టీడీపీ జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్యబాబు పార్టీల శ్రేణులకు పిలుపునిచ్చారు. గత ఎన్నికలో మండలంలోని 23 పంచాయతీల్లో మెజార్టీ సాధించి మండలంలో మొదటి, రెండవ స్థానాలు సాధించిన జైతవరం, అర్జునగిరి గ్రామాల ఉమ్మడి కూటమి కార్యకర్తలకు ఆదివారం సాయంత్రం రూ.75 వేలు చొప్పున అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ సోదరుడు సురేష్‌నాయుడు ప్రోత్సాహకాలు అందించారు. ఈ సందర్భంగా తాతయ్యబాబు మాట్లాడుతూ అనకాపల్లి జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు నామినేషన్ వేసిన తరువాత మాడుగుల, యలమంచిలి నియోజకవర్గాల్లో పరిస్థితులు కాస్త బాగోలేనట్లు మొదట్లో కనిపించిందని అన్నారు. అయితే మాడుగుల నియోజకవర్గానికి ఎన్నికల ఇన్‌చార్జిగా సీఎం సురేష్‌నాయుడు బాధ్యతలు తీసుకున్న తరువాత తప్పనిసరిగా మాడుగులలో విజయం సాధిస్తామన్న ధీమా వచ్చిందని అన్నారు. మాడుగుల మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు మాట్లాడుతూ అనకాపల్లి ఎంపీ అభ్యర్థిగా కూటమి తరపున సీఎం రమేష్‌ను ప్రకటించడంతో ఆ పరిధిలో ఉన్న ఎంపీతో పాటు ఏడు ఎమ్మెల్యేలు గెలుస్తామన్న ధీమా వచ్చిందన్నారు. సీఎం సురేష్‌నాయుడు మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని విమర్శించారు. పార్లమెంట్ పరిధిలో మాడుగుల, చోడవరం నియోజకవర్గాల అభివృద్ధి, పరిశ్రమల ఏర్పాటుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కంకణం కట్టుకున్నారన్నారు. ఈ రెండు నియోజకవర్గాల్లో ఐదువేల ఎకరాల వరకూ స్థలాన్ని సేకరించాలని జిల్లా అధికారులకు ఆదేశించారన్నారు. టీడీపీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోతల చిన్నంనాయుడు, బొబ్బాది తాతారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బీజేపీ నియోజవర్గ ఇన్‌చార్జి మేరపురెడ్డి శ్రీనివాస్, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి రెడ్డి సన్యాసినాయుడు, టీడీపీ నాయకులు కుచ్చు కళావతి, గండి ముసలినాయుడు, రెడ్డి రాము, పైల ముత్యాలనాయుడు, జాజిమొగ్గల ప్రసాద్, బీళ్ల కోటేశ్వరరావు, పంచాడ దాలెంనాయుడు, యర్రా అప్పారావు, శరగడం శివ, గవిరెడ్డి జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

వర్షాలతో నిండిన చెరువులు



ఎర్రవరంలో నిండిన చెరువు

గొలుగొండ, జూలై 28 : మండలంలోని వారంరోజులుగా కురుస్తున్న వర్షాలకు చెరువులు నీటితో నిండాయి. పాతమల్లంపేటలో గల ధారగెడ్డ, రాళ్లగెడ్డ, ఎర్రవరం, పాకలపాడు, పాతమల్లంపేట, పప్పుశెట్టిపాలెం, చీడిగుమ్మల, కొత్తఎల్లవరం, జోగంపేట గ్రామాల్లో గల చెరువులు నీటితో కళకళలాడుతున్నాయి. ముందస్తుగా చెరువులు నిండడంతో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సాగునీరు కు ఢోకా లేదని రైతులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. గ్రామాల్లో వరినాట్లు సాగులో రైతులు బిజీగా వున్నారు.

స్టాండింగ్ కమిటీ ఎన్నికకు నేడు కూటమి అభ్యర్థుల నామినేషన్

... 5వ పేజీ తరువాయి

స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఖరారవగానే అదనపు కమిషనర్ డాక్టర్ వై.శ్రీనివాసరావుకు నామినేషన్లు అందజేస్తారు. మరోవైపు వైసీపీ కార్పొరేటర్లు కూడా స్టాండింగ్ కమిటీ ఎన్నికలో పోటీ చేయాలని నిర్ణయించారు. ఇప్పటికే వైసీపీ కార్పొరేటర్లు తోట పద్మావతి, బిపిన్ కుమార్‌జైన్, నక్కెళ్ల లక్ష్మి, పల్లా అప్పలకొండ, అక్కరమాని రోహిణి, రెయ్యి వెంకటరమణ, సాడి పద్మారెడ్డి, గుండపు నాగేశ్వరరావు, ముర్రువాణి, మహ్మద్ ఇమ్రాన్ పేర్లను ఎంపిక చేసి పార్టీ అధిష్ఠానానికి పంపించినట్టు తెలిసింది. అయితే అటు నుంచి ఇంకా స్పందన రాకపోవడంతో మంగళవారం నామినేషన్లు దాఖలు చేయాలని నిర్ణయించారు.

సరైన రహదారి లేక పెద్దపేట విద్యార్థుల కష్టాలు



కష్టాలు చెబుతున్న విద్యార్థులు

రోలుగుంట, జూలై 28 : సరైన రహదారి సదుపాయం లేకపోవడంతో పెదపేట ప్రాథమిక పాఠశాలవిద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత వారం రోజులుగా కురిసిన వర్షాల కారణంగా పాఠశాలకు వెళ్లే మట్టిరోడ్డు పూర్తిగా బురదమయంగా మారింది. దీంతోఆ దారిలో వెళ్లేందుకు నానాతిప్పలు పడుతున్నారు. శుక్రవారం విద్యార్థులు ఆ బురద రోడ్డులోనే పాఠశాలకు వెళుతూ ఉన్నతాధికారులకు మొరపెట్టుకున్నారు. దీనిపై హెచ్ఎం అప్పలనాయుడు మాట్లాడుతూ ఈ పాఠశాలలో 30 మంది విద్యార్థులు చదువుతున్నారని సరైన రహదారి సదుపాయం లేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే అధికారులు స్పందించి రోడ్డు వేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

మ్యాట్రిమోనీ మోసాలు

... 5వ పేజీ తరువాయి

ఫొటోలు, వీడియోలు పంపించి అందిన కాడికి దోచుకుంటున్నారు. విశాఖలోని ఓ మెకానికల్ ఇంజనీర్ కొద్దిరోజులకిందట మ్యాట్రిమోనీ వెబ్‌సైట్‌లో తన వివరాలను రిజిస్టర్ చేశారు. కొద్దిరోజులకే అతనికి ఫోన్ వచ్చింది. తాను కూడా ఇంజనీరింగ్ పూర్తిచేసి ఉద్యోగాన్వేషణలో ఉన్నానని, మంచి సంబంధం కోసం అదే వెబ్‌సైట్‌లో పేరు నమోదు చేసుకున్నానని చెప్పింది. దీంతో బాధితుడు తన కుటుంబ వివరాలు, ఆర్థిక స్థితిగతులను వివరించాడు. అనంతరం ఇద్దరూ వాట్సాప్, ఇన్‌స్టాలో చాటింగ్ మొదలుపెట్టారు. కొద్దిరోజులకు తన పుట్టినరోజుని, బంగారు ఆభరణాల కొనుగోలు చేయాలని డబ్బులు అడిగింది. ఆ తర్వాత కూడా పలు కారణాలను చూపించి సుమారు రూ.26 లక్షలు వరకూ గుంజేసింది. ఇంకా డిమాండ్ చేస్తుండడంతో స్నేహితుల సూచనమేరకు సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదుచేశాడు. పోలీసులు దర్యాప్తు చేసి యువతి పేరుతో మోసం చేస్తున్న కొమ్మిగాని లోకేశ్‌ను ఈ నెల 24న హైదరాబాద్‌లో అరెస్టు చేశారు. అతడికి సహకరించిన ఆర్.సాయిధీరజ్‌తోపాటు మైకోల్‌షాలినీ పరారీలో ఉండడంతో వారి కోసం గాలిస్తున్నారు. అలాగే ఎంవీపీకాలనీకి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌కు కూడా ఇలాంటి అనుభవమే ఎదురైంది. హైదరాబాద్‌కు చెందిన బత్తి సాయిప్రియ అతడ్ని మోసం చేసి రూ.22 లక్షలు కొట్టేసింది. సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆమెను ఈనెల 26న అరెస్టు చేశారు.

నైజీరియా వాసుల చేతిలో...

విశాఖకు చెందిన ఓ వైద్యురాలు తన భర్తతో విడిపోయారు. రెండో పెళ్లి కోసం వెబ్‌సైట్‌లో తన ప్రొఫైల్ రిజిస్టర్ చేశారు. ఆమె నంబరుకు అమెరికా నుంచి అంటూ ఓ వ్యక్తి ఫోన్‌చేశాడు. తనకు భారతీయురాలిని పెళ్లి చేసుకోవాలనే కోరిక ఉందని, సంపన్న కుటుంబానికి చెందిన వాడినని నమ్మించాడు. ఇద్దరు యువతులతో సముద్రంలో బోటింగ్ చేస్తున్న వ్యక్తిని తన తండ్రిగా పేర్కొంటూ ఓ ఫొటో, స్టెప్ మదర్‌గా పేర్కొంటూ మరొకరి ఫొటోను వైద్యురాలి వాట్సాప్‌కు పంపించాడు. మంచి ఇంటీరియల్ డెకరేషన్‌తో వున్న గదిలోని సీలింగ్‌కి ఫొటో తీసి తన బెడ్‌రూమ్‌గా చూపించాడు. తన కుటుంబంలో వ్యక్తిగత స్వేచ్ఛ ఎక్కువని ఆమెను మరింతగా ఆకర్షించాడు.

దీంతో ఆమె పెళ్లికి సిద్ధమయ్యారు. దీంతో రెండు రోజుల్లో ఇండియా వస్తున్నానంటూ విమానం టిక్కెట్లను ఆమెకు వాట్సాప్ చేశాడు. అమెరికన్ కరెన్సీతోపాటు విలువైన బహుమతులు తెస్తున్నానని నమ్మించాడు. అయితే రెండు రోజుల తర్వాత తనను ఎయిర్‌పోర్టులో అధికారులు అడ్డగించారని, ఓ వ్యక్తితో కస్టమ్స్ అధికారిగా మాట్లాడించాడు. బహుమతులు తిరిగి అప్పగించాలంటే జరిమానా కట్టాలని చెప్పడంతో ఆమె సుమారు రూ.24.29 లక్షలు ట్రాన్స్‌ఫర్ చేశారు. తరువాత ఇంకా కావాలని కోరడంతో మోసపోయినట్టు గుర్తించి సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేయగా నిందితులు ఢిల్లీలో ఉంటున్నట్టు తేలింది. దీంతో అక్కడ నైజీరియాకు చెందిన ఒసాస్(38), అతనికి సహకరించిన మిస్లేయిర్‌ఖాన్ (27)లను అరెస్టు చేశారు.

☛ సంక్షిప్తంగా..

తాండవ ఎడమ కాలువలో పూడిక తొలగించాలి



కాలువలో పెరిగిన గడ్డి

నాతవరం, జూలై 28 : జిల్లేడిపూడి సమీపంలోని తాండవ ఎడమ కాలువలో దట్టంగా పెరిగిన గుర్రపు డెక్క, పేరుకుపోయిన పూడికను వెంటనే తొలగించాలని తాండవ ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ పారుపల్లి కొండబాబు కోరారు. ఆదివారం ఆయన టీడీపీ నాయకుడు లోకవరపుబాబుతో కలసి కాలువను పరిశీలించారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ కాలువలో విపరీతంగా గడ్డి, పూడిక పేరుకుపోవడవతో చివరి ఆయకట్టుభూములకు సాగునీరు అందడం లేదన్నారు. జిల్లా కలెక్టర్ స్పెషల్ గ్రాంటు మంజూరు చేసి తాండవ కుడి ఎడమ కాలువల్లో పూడికతీత పనులు, అలాగే చమ్మచింత కుడికాలువ అక్విడెట్ దగ్గర కాలువ బలహీనంగా ఉన్నచోట గండి పడకుండా వెంటనే పనులు చేపట్టాలన్నారు. వచ్చే నెల 15న తాండవ నీరు విడుదల చేయాలని అధికారులు నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. ఈలోగా రైతులు ఇబ్బంది పడకుండా పూడికతీత చేపట్టాలని కొండబాబు కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గొలుగొండ, జూలై 4 : మండలంలోని చీడిగుమ్మల విద్యుత్ ఫీడర్‌లో గల గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వీడీవీ రామకృష్ణారావు తెలిపారు. మండలంలోని గొలుగొండ విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి చీడిగుమ్మల మధ్యలో గల గ్రామాలకు ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. దీంతో వినియోగదారులు గమనించాలని తెలిపారు. విద్యుత్ లైన్ కింద చెట్లు తొలగించే కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు.

'ఉపాధి' కూలీల నిరసన



రావికమతం, జూలై 28 : 'ఉపాధి అయినా కల్పించండి లేదా నిరుద్యోగ భృతి అయినా ఇప్పించండి' అంటూ పాత కొట్నాబిల్లి ఆదివాసీలు ఖాళీ కంచాలు, తట్టలతో ఆదివారం నిరసన తెలిపారు. గిరిజన సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంఘ గౌరవ అధ్యక్షులు కె.గోవిందరావు మాట్లాడుతూ టి.అర్జాపురం పంచాయతీ శివారు పి.కొట్నాబిల్లిలో 130 మంది జనాభా ఉన్నారన్నారు. ఈ గ్రామంలో 70 మంది ఆదివాసీలకు జాబ్ కార్డులున్నాయన్నారు. ఇక్కడున్న వీఆర్పీ రెండేళ్ళ క్రితమే విధుల నుంచి మానేశారని తెలిపారు. అప్పటి నుంచి ఇక్కడ కూలీలకు ఉపాధి అధికారుల పర్యవేక్షణలో మేట్‌లతో కూలీలకు ఉపాధి పనులు కల్పించేవారన్నారని తెలిపారు. మేట్ పర్యవేక్షణలో సీతమ్మ చెరువులో మూడు వారాలు పాటు పూడిక తీత పనులు చేయించారని, రెండు నెలలు గడిచినా కూలీలకు వేతన బకాయిలు చెల్లించలేదని తెలిపారు.

ప్రధాన లైన్‌లో వైర్లు తెగిపోవడంతోనే విద్యుత్‌కు అంతరాయం

- ఏపీడీసీఎల్ ఏఈ వెంకటరావు

చీడికాడ, జూలై 28 : విద్యుత్ మెయిన్ వైర్లు తెగిపోవడంతో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడిందని ఏపీడీసీఎల్ ఏఈ నమ్మి వెంకటరావు ఆదివారం సాయంత్రం తెలిపారు. 'ఆధార్ కేంద్రానికి విద్యుత్ అంతరాయం' శీర్షికన ఆదివారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి ఆయన స్పందించారు. శనివారం మధ్యాహ్నం సుమారు 2.30గంటలకు కోనాం శివారు కొండ్ల కొత్తూరులో యర్రా రమణ అనే రైతు పొలంలో మెయిన్ విద్యుత్‌వైర్లు తెగిపడిపోవడంతో ఆ రైతు ఇచ్చిన సమాచారం మేరకు సచివాలయం లైన్‌మెన్ అక్కునాయుడు, ఇతర కార్మికులు ఆ వైర్లును పరిశీలించి వెంటనే బాగు చేశారని తెలిపారు. దీంతో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకూ అంతరాయం ఏర్పడిందని తెలిపారు. అలాగే ఈనెల 12న కోనాం ఫీడర్ పరిధిలో తుప్పలు తొలగించిన తరువాత కోనాం పంచాయతీలో సరఫరాకు అంతరాయం ఎక్కడా లేదని, అప్పుడప్పుడు రాత్రి సమయాల్లో అడవి జంతువులకు వైర్లు పెట్టడం వలన అంతరాయం ఏర్పడి ఉండవచ్చన్నారు. 90 శాతం విద్యుత్ అంతరాయం లేదని ఆయన తెలిపారు.

రావణాపల్లి పంట కాలువలు అస్తవ్యస్తం



మరమ్మతులకు గురైన మదుం

... 5వ పేజీ తరువాయి

పంట కాలువల లైనింగ్, పూడిక తీత, మదుములు, గేట్లు, షట్టర్లు మర్మతులకు రూ.2.5 కోట్లతో ఇరిగేషన్ అధికారులు ప్రతిపాదనలు పంపితే బుట్టదాఖలు చేసింది. రిజర్వాయర్ నిండా నీరు ఉన్నా ప్రయోజనం ఉండడం లేదని, పంటకు అవసరం వచ్చినప్పుడు సాగునీరు అందడం లేదని రైతులు వాపోతున్నారు. రిజర్వాయర్ గేట్లు ఎత్తి నీరు విడుదల చేసినా ఆయకట్టుకు సాగునీరు అందే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉపాధి హామీ పథకంలో కాలువలో పూడికతీత పనులు చేపట్టాలని కోరుతున్నారు.